# 4వ వర్ధంతి



కీ.శే.

## శ్రీ గడ్డం ఉప్పలయ్య గౌడ్

మరణం : 30-09-2022

నాలుగు వర్ధంతులు గడిచినా...
మీ జ్ఞాపకాలకు వర్ధంతి లేదు నాన్నా,
మీరు మాతో లేని లోటు ఎప్పటికీ తీరదు...
మీరు నేర్పిన బాటలో నడుస్తూ,
మీ జ్ఞాపకాలతోనే మా జీవిత ప్రయాణం.

ఇట్లు
గడ్డం కుటుంబ సభ్యులు

తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
బుధవారం
30 సెప్టెంబర్ 2026
సంపుటి 03
సంచిక 351
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

## రాబోయే నెలల్లో భారీ ఆహార సంక్షోభం!.. విదేశాంగ మంత్రి జైశంకర్ హెచ్చరిక



న్యూయార్క్: రాబోయే నెలల్లో ప్రపంచం భారీ ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉన్నదని విదేశాంగ మంత్రి ఎన్ జైశంకర్ మంగళవారం హెచ్చరించారు. ఎరువుల కొరత, ధాన్యం రవాణాకు అంతరాయాలు, సూపర్ ఎల్ నినో ముప్పుతో పాటు ఉక్రెయిన్, గల్ఫ్‌లోని యుద్ధాలు గ్లోబల్ సౌత్ దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆయన అన్నారు. న్యూయార్క్‌లో ఆసియా సొసైటీ నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ మాట్లాడుతూ, రెండు యుద్ధాలు అభివృద్ధి చెందుతున్న దేశాలపై తీవ్ర ప్రభావం చూపాయని చెప్పారు.

ముఖ్యంగా ఇంధనరంగంపై భారత్ ఆందోళనగా ఉందని, మార్కెట్ చాలా ఒత్తిడితో ఉందని పేర్కొన్నారు. చమురు సరఫరాలతో రాజకీయాలు ముడిపెడితే ధరలు పెరుగుతాయని జైశంకర్ అన్నారు. ఇది మరింత సమస్యకు దారి తీస్తున్నదని చెప్పారు.

మిగతా 2వ పేజిలో..

## అమెరికాలో ఎస్సార్ గ్రూప్ భారీ పెట్టుబడులు!

**రూ.1.72లక్షల కోట్లతో అమెరికాలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్**



వాషింగ్టన్, సెప్టెంబరు 29: భారత్‌కు చెందిన ఎస్సార్ కంపెనీ అమెరికాలో భారీ పెట్టుబడులు పెడుతోంది. రూ.1.72 లక్షల కోట్ల (18 బిలియన్ డాలర్లు)తో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద ఉక్కు కర్మాగారాన్ని నిర్మించబోతోంది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా వెల్లడించారు. శ్వేతసౌధంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సార్ గ్రూపు సహ వ్యవస్థాపకుడు, వైస్ చైర్మన్ రవి రుయా, ఆయన కుమారుడు రేవంత్ రుయా (మెసాబి మెటాలిక్స్ చైర్మన్)లతో కలిసి ట్రంప్ ఈ ప్రకటన చేశారు. "లోవా రాష్ట్రంలో మెసాబి మెటాలిక్స్ సంస్థ అమెరికాలోనే అతిపెద్ద ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయనుందని ప్రకటించడానికి సంతోషిస్తున్నాం" అని ట్రంప్ చెప్పారు. ఎస్సార్ గ్రూప్‌కు

మిగతా 2వ పేజిలో..



## నేడు విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం'

**ఉమ్మడి కృష్ణా జిల్లాలో రూ.24,297 కోట్ల విలువైన స్థలాల క్రమబద్ధీకరణ**

**24,057 కుటుంబాలకు పట్టాలు పంపిణీ చేయనున్న సీఎం చంద్రబాబు**

విజయవాడ, సెప్టెంబరు 29 నిరుపేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో దాదాపు 24 వేల కుటుంబాలకు ఇళ్లపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ సీఎం చంద్రబాబు బుధవారం పట్టాలు పంపిణీ చేయనున్నారు. విజయవాడ నగరంతో పాటు ఎన్టీఆర్ జిల్లా గ్రామీణ ప్రాంతాలు, కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న పేదల నివాస స్థలాలను క్రమబద్ధీకరించనున్నారు. పేదలు నివసిస్తున్న భూమిపై వారికి సర్వ హక్కులు కల్పించేలా మంజూరు చేసిన నిరంభ్యంత ర పట్టాలను సీఎం చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇటీవల విశాఖ లో భారీసంఖ్యలో పేదలకు ఇళ్ల పట్టాలను అందజేసిన విషయం

మిగతా 2వ పేజిలో..

# మోదీ..గద్దె దిగు!

- సీఈసీ జ్ఞానేశ్, అమిత్ షా కూడా తప్పుకోవాలి.. సర్‌ను తక్షణమే నిలిపివేయాలి
- తొలగించిన 13 కోట్ల పేర్లను తిరిగి చేర్చాలి
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం
- నాడు నోట్ల రద్దు.. నేడు ఓట్ల రద్దు
- జెన్‌జీని ఓటుకు దూరం చేసేందుకే ఫామ్-6లో
- ఏకపక్షంగా మార్పులు: మల్లికార్జున ఖర్గే
- ఈవీఎం, ఓటరు జాబితా రెండూ ట్యాంపరింగే
- 2024 లోకసభ ఎన్నికలు ఫిక్స్ అయ్యాయి
- నిరసనలతో ఆగం... ప్రతిఘటనలే: రాహుల్
- జ్ఞానేశ్‌కు మేమేంటో చూపిస్తాం: కేసీ వేణుగోపాల్
- రేవంత్, దామోదర్, రఘువీరారెడ్డి హాజరు





న్యూఢిల్లీ, సెప్టెంబరు 29 ఓట్ల చోరీకి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ను తక్షణమే నిలిపివేయాలని కోరింది. ఈ ప్రక్రియలో తొలగించిన 13 కోట్ల 30 లక్షల మంది పేర్లను తిరిగి జాబితాల్లో చేర్చాలని తీర్మానించింది. మంగళవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సీడబ్ల్యూసీ సమావేశమైంది. సమావేశం దాదాపు రెండున్నర గంటలు సాగింది. సీపీపీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శులు ప్రియాంకాగాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సీనియర్ నేతలు పి.చిదంబరం, సచిన్ పైలట్, ముకుల్ వాస్నిక్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి(తెలంగాణ), డీకే శివకుమార్(కర్ణాటక), వీడీ సతీశన్(కేరళ), సుఖ్వీందర్ సింగ్ సుఖు(హిమాచల్ ప్రదేశ్) పాల్గొన్నారు. తెలంగాణ నుంచి సీడబ్ల్యూసీ సభ్యుడు, మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ నుంచి రఘువీరారెడ్డి పాల్గొన్నారు. మొత్తం 68

మిగతా 2వ పేజిలో..

## అన్ని ఔషధాలపై 16-శాతం మార్జిన్ పరిమితి?

- ధరల్లో ఎందుకీ వ్యత్యాసం?
- ఆస్పత్రిలోనే ఎందుకు కొనాలి?
- కేంద్రానికి సుప్రీం ప్రశ్నలు
- అన్ని ఔషధాలపై 16 శాతం మార్జిన్ పరిమితి?
- ఎందుకు విధించొద్దు..ధరల్లో తేడా ఎందుకు?
- క్యాన్సర్ మందులను 10 రెట్ల అధిక ధరకు
- విక్రయించడంపై కేంద్రానికి సుప్రీం ప్రశ్న



2వ పేజిలో..

## ఎకరం 250 కోట్ల ఉన్న స్థలాల్లో ఇందిరమ్మ టవర్లు

- గత సర్కారు హైదరాబాద్‌కు 40కి.మీ దూరంలో కట్టించింది
- వారు పదేళ్లలో కట్టిన ఇళ్లకన్నా ఇప్పటికే రెట్టింపు ఇళ్లు కట్టాం

2వ పేజిలో..

## రూ.35కే కిలో ఉల్లి

- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా.. మంత్రులు అచ్చెన్న, మనోహర్

అమరావతి, సెప్టెంబరు 29 ఉల్లి ధరల పెరుగుదల నేపథ్యంలో కిలో రూ.35 చొప్పున రైతుబజార్లలో బుధవారం నుంచి విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆధార్‌కార్డు లేదా రేషన్‌కార్డు ఆధారంగా ఒక్కో కుటుంబానికి, నెలకు రెండు కిలోల చొప్పున సరఫరా చేయనున్నారు. తొలి విడతగా విజయవాడలోని అన్ని రైతుబజార్లలో రాయితీ ధరకు ఉల్లిపాయల్ని విక్రయించనున్నారు.



## సంఘ్ నీడ లేని చదువులు అందించాలి

- తమ సీఎంలకు కాంగ్రెస్ దిశానిర్దేశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29 కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో విద్యారంగ సంస్కరణలపై నెల రోజుల్లోగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆ పార్టీ నిర్ణయించింది. ప్రతీ రాష్ట్రంలో ప్రముఖ విద్యా నిపుణులు, సంబంధిత వర్గాలతో రాష్ట్ర స్థాయి విద్యా సదస్సులు నిర్వహిస్తారు. వాటి నుంచి వచ్చిన సూచనల ఆధారంగా సీఎంలు ఈ ప్రణాళికలు రూపొందిస్తారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, విద్యామంత్రుల సమావేశం జరిగింది. విద్యారంగాన్ని ఉపయోగించి ఆర్ఎ?సఎస్ తన విభజన అజెండాను ముందుకు తీసుకెళ్తోందని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ దాన్ని

మిగతా 2వ పేజిలో..

## రెండేళ్లలో పదింతల అభివృద్ధి

- అప్పులకుప్పగా ఉన్న రాష్ట్రం చంద్రబాబు అనుభవంతో గట్టెనపడింది
- పల్లెపండుగ 3.0 కింద 11,085 కోట్లతో పనులు
- ప్రజలు భాగస్వాములు కావాలి: డిప్యూటీ సీఎం



నెల్లూరు, సెప్టెంబరు 29 వైసీపీ ఐదేళ్ల ప్రభుత్వంలో కంటే ఈ రెండేళ్లలో పది రెట్లు ఎక్కువగా అభివృద్ధి పనులు జరిగాయని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. నెల్లూరు జిల్లా రామాపురంలో మంగళవారం నిర్వహించిన పల్లె పండుగ 3.0 వేదికపై ఆయన మాట్లాడారు. 2019–24 మధ్య బ్లీచింగ్ కొనడానికి కూడా పంచాయతీల వద్ద డబ్బులు లేవని, ఈ రెండేళ్ల కూటమి పాలనలో ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధి దిశగా సాగుతోందన్నారు. "ముఖ్యమంత్రి చంద్రబాబుకు

మిగతా 2వ పేజిలో..



## నీ చేతగానితనాన్ని అధినేతపై రుద్దుతావా?

2వ పేజిలో..

## సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

2వ పేజిలో..

## మోదీ.. గద్దె దిగు!

మంది సభ్యులు సమావేశానికి వచ్చారు. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరగడం లేదని జైరాంరమేశ్ విలేకరులతో అన్నారు. వేణుగోపాల్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సంఘానికి, ప్రధాని-హోంమంత్రిలతో మ్యాచ్ ఫిక్సింగ్ జరుగుతోందని ఆరోపించారు.

### తీర్మానంలో ఏముంది?

ఎన్నికల సంఘం(ఈసీఐ) ఒక్క వ్యక్తి నియంత్రణలో నడిచే సంస్థగా మారిపోయిందని సీడబ్ల్యూసీ తీర్మానం ఆరోపించింది. తోటి కమిషనర్లను సంప్రదించకుండానే సీఈసీ నిర్ణయాలు తీసుకుంటున్నారన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొంది. ఫారం-6 నిబంధనల్లో కమిషన్ అనుమతి లేకుండా, చట్ట విరుద్ధంగా మార్పులు చేసిందని తప్పుబట్టింది. "ఈ ఓట్ల చోరీని ప్రధాని, హోంమంత్రి తరఫున సీఈసీయే దగ్గరుండి నడిపించారు. వారి ముగ్గురి రాజీనామా మినహా మరేదీ మన ప్రజాస్వామ్యాన్ని కాపాడలేదు" అని తీర్మానం స్పష్టం చేసింది. దోషులకు శిక్ష పడే వరకు పోరాటం కొనసాగిస్తామని, ఈ పోరాటం పార్లమెంటులో, న్యాయస్థానాల్లో, వీధుల్లో సాగుతుందని ప్రకటించింది. ఓటు హక్కును కాపాడుకోవడం కోసం జరుగుతున్న ఈ పోరాటం స్వాతంత్ర్య పోరాటంతో సమానమని అభివర్ణించింది.

### ఓట్ల రద్దు ఒక కుట్ర: ఖర్గే

వర్కింగ్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రారంభోపన్యాసం చేశారు. పదేళ్ల క్రితం ప్రధాని మోదీ పెద్ద నోట్ల రద్దుతో దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశారని, ఇప్పుడు ఓట్ల రద్దుతో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఓటర్ జాబితాల రక్షకుడైన ఎన్నికల సంఘమే భక్షకుడిగా మారిందని అన్నారు. సొంత సహచరులే నమ్మని సీఈసీ జ్ఞానేశ్‌ను దేశం ఎలా నమ్ముతుంది? అని ఖర్గే ప్రశ్నించారు. మోదీ ఒత్తిడితోనే సీఈసీ ఇలా వ్యవహరించారని, అందువల్ల ప్రధాని నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 1988 డిసెంబరులో అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతకు అధికారం ఇచ్చారని ఖర్గే గుర్తు చేశారు. మోదీ మాత్రం జెన్‌జీ యువతపై కక్షతో ఫారం-6 నిబంధనలను గుట్టు చప్పుడు కాకుండా మార్చారని ఆరోపించారు. ఇలా పథకం ప్రకారం యువతను, పేదలను, దళితులను ఓటుకు దూరం చేస్తున్నారని అన్నారు. త్వరలో ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయని ఖర్గే గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఏ ఓటరూ హక్కు కోల్పోకుండా చూడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

### రెండు రకాల మ్యాచ్ ఫిక్సింగ్: రాహుల్

సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, దేశంలో రెండు రకాల మ్యాచ్ ఫిక్సింగ్ జరుగుతోందన్నారు. ఈవీఎంలలో, ఓటరు జాబితాల్లో ఉద్దేశపూర్వక ట్యాంపరింగ్ చేస్తున్నారన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలు పూర్తిగా ఫిక్స్ అయ్యాయని ఆయన అన్నట్లు తెలిసింది. సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు రక్షణ కల్పిస్తూ 2023 డిసెంబరులో చేసిన చట్టం కూడా రాజ్యాంగ విరుద్ధం అని ఆయన అన్నట్లు సమాచారం. హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికల అక్రమాలను కాంగ్రెస్ లేవనెత్తినపుడు చాలామంది నమ్మలేదని రాహుల్ గుర్తు చేశారు. వాస్తవాల ఆధారంగా పార్టీ ఇచ్చిన ప్రజెంటేషన్లతో రెండేళ్లలో వాతావరణం మారిందన్నారు. ఇప్పుడు ఈసీ వ్యవహారాలు బయట పడుతున్నాయంటే అది కాంగ్రెస్ పోరాట ఫలితమేనని చెప్పారు. ఎన్నికల సంఘం అవకతవకలపై పోరాటంలో కాంగ్రెస్ ఒంటరి పోరాటానికి సిద్ధంగా ఉందని పార్టీ ముఖ్యనేత ప్రియాంకగాంధీ అన్నారు. దీనికోసం కాంగ్రెస్ ఎవరిపైనా ఆధారపడదని చెప్పారు. ఈ అంశాన్ని మొదటి నుంచీ కాంగ్రెసే లేవనెత్తుతోందని, ఒంటరిగానైనా పోరాడే సత్తా తమకు ఉందని అన్నారు. జ్ఞానేశ్ మొండిగా ఉంటారని, రాజీనామా చేయరని ఓ సభ్యుడు వ్యాఖ్యానించగా, "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయలేదా? రాజీనామా చేసే వరకు వీధుల్లో ఆందోళన కొనసాగిస్తాం" అన్నారు. జ్ఞానేశ్‌కు ఒక్కరోజు కూడా సీఈసీగా కొనసాగే నైతిక హక్కు లేదని కేసీ వేణుగోపాల్ అన్నారు. ఆయన ఒక పనిముట్టు మాత్రమేనని, నియంతలు ప్రజల విశ్వాసం కోల్పోయినపుడు అధికారంలో కొనసాగేందుకు ఇలాంటి సాధనాలను వాడుకుంటారని వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ కానీ, సీఈసీ చర్యలు కానీ ప్రధాని, హోంమంత్రి అంగీకారం లేకుండా జరగేవి కావన్నారు.

## సంఘ్ నీడ లేని చదువులు అందించాలి

ఎలా తిప్పికొట్టాలి? కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు విద్యారంగంలో ఆదర్శవంతమైన రాష్ట్రాలుగా ఎలా ఎదగాలి అనే అంశాలను ఈ భేటీలో చర్చించింది.

### తెలంగాణలో సంస్కరణలపై రాహుల్ హర్షం

తెలంగాణలో బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రోగ్రామ్ తలపెట్టినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యారంగాన్ని ప్రక్షాళన చేయడానికి, పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందించేందుకు వీటిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. సీఎంల సమావేశంలో ఆయన తెలంగాణలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలను వివరించారు. 105 నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా స్కూళ్లు వస్తున్నాయని చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాల విద్యార్థులు ఒకే ప్రాంగణంలో కలిసి చదువుకునేలా పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు. యువతకు నైపుణ్యాలే లక్ష్యంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యామంత్రిగా తానే అనేక సంస్కరణకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ చర్యలపై రాహుల్, ఖర్గే హర్షం వ్యక్తం చేశారు.

## సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

సిరిసిల్ల, సెప్టెంబరు 29 ముఖ్యమంత్రి హోదాలో ఎనుముల రేవంత్ రెడ్డి తొలిసారిగా సిరిసిల్ల పర్యటనకు వస్తుం డడంతో అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. బుధవారం సాయంత్రం 4 గంట లకు కరీంనగర్ నుంచి హెలికాప్టర్ ద్వారా సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదా నానికి సీఎం చేరుకుంటారు. సిరిసిల్ల అంబే ద్కర్ చౌరస్తా నుంచి పాదయాత్రగా రగుడు కలెక్టరేట్ చౌరస్తాకు స్థలం వద్దకు సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ చేరుకుంటా రు. తొలిసారిగా వస్తున్న నేపథ్యంలో అధికార పార్టీ శ్రేణులు భారీ జన సమీకరణకు పూనుకున్నారు. స్వశక్తి సంఘాల మహిళల ను తరలించే విధంగా ఏర్పాట్లు చేశారు. పాదయాత్రలో 40 వేల మంది, బహిరంగ సభకు 60 వేల మందితో పాటు ఇతర జిల్లాలతో కలిపి లక్షకు పైగా జన సందోహం మధ్య బహిరంగ సభ నిర్వహించే ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను మంగళవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీని వాస్, విజయరమణారావు, ప్రభుత్వ సలహా దారుడు హనుమంతరావులు పరిశీలించారు. ముఖ్యమంత్రి సభా ప్రాంగణం వద్ద రూ 345.78 కోట్లతో చేపట్టి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఇందులో రూ 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడె న్షియల్ స్కూల్ నిర్మాణం, కోనరావుపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, రూ 99.40 కోట్లతో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. వీటితోపాటు సిరిసిల్ల, వేములవాడ, తంగళ్ళ పల్లి, వీర్నపల్లి వేములవాడ రూరల్, రుద్రంగి లో ఆరు తహసీల్దార్ కార్యాలయాలు, వేములవాడలో సబ్‌రిజిస్టర్ కార్యాలయం, సిరిసిల్ల, వేములవాడలో ఆర్డీవో కార్యాలయా లు, రుద్రంగిలో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు, సిరిసిల్ల, వేముల వాడలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుతో పాటు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడ తారు. ఈ నేపథ్యంలో సిరిసిల్లలో నేత బజా ర్‌ను రూ6 కోట్లతో కమిషనర్ మంజూరు చేశారు. సిరిసిల్లలో నిర్మించిన ఇందిరా మహి ళ శక్తి భవనాన్ని కూడా ప్రారంభిస్తారు.

## నీ చేతగానితనాన్ని అధినేతపై రుద్దుతావా?

- క్విడ్‌ప్రోకోలతో పార్టీని పాతాళంలోకి నెట్టింది మీరే
- నేను నీలాగా విషనాగుల మాటలు విని మాట్లాడను
- కేటీఆర్‌పై కవిత ధ్వజం
- కొంగరఖుర్దు(ఏ)లో కాంగ్రెస్, బీఆర్ఎస్ భూ మాఫియా!
- రూ.5 వేల కోట్ల విలువైన భూములు కొల్లగొడుతున్నారు
- ఆ రిజిస్ట్రేషన్లు రద్దుచేయాలి..
- లేదంటే ప్రభుత్వాన్ని కోర్టుకీడుస్తా: కవిత

హైదరాబాద్, సెప్టెంబరు 29 "మీ ఫామ్‌హస్‌లు, అక్రమంగా ఇచ్చిన పర్మిషన్లు, ఆంధ్రా దోస్తులకు ఇచ్చిన నజరానాలు, క్విడ్ ప్రో కో దందాలతో మీ పార్టీని పాతాళంలోకి నెట్టింది మీరు కాదా?" ..అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత ధ్వజమెత్తారు. "మన ప్రభుత్వంల కేసీఆర్ ఒక నిర్ణయం తీసుకున్నరు. మంత్రి ఎవరున్నా నియోజకవర్గంలో ఎమ్మెల్యేలదే నడ్వాలె అన్నరు. 'నియోజకవర్గంలో అక్కడి ఎమ్మెల్యేనే ముఖ్యమంత్రి. అక్కడ వేరేవాళ్లు వేలు పెట్టొద్ద'ని చెప్పిన్రు. ఇదే మనం చేసిన తప్పు" అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను బీఆర్ఎస్‌లో ఒక నాయకుడిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే తనను పార్టీనుంచి సస్పెండ్ చేశారని.. ఇప్పుడు అదే నాయకుడితో అంటకాగుతూ పార్టీ అధినేత తీరుతోనే నష్టపోయామంటూ బహిరంగ వ్యాఖ్యలు చేయడం పార్టీకి వ్యతిరేకం కాదా? అని కేటీఆర్‌ను ఆమె నిలదీశారు.

"పెద్దమనిషినే తప్పుబడుతున్నావ్. బీఆర్ఎ?సకు గోతిని తవ్వుతున్నావ్" అని దుయ్యబట్టారు. తాను విషనాగుల చెరలో లేనని, ఎవరో చెప్పేమాటలు విని ఏదిపడితే అది మాట్లాడబోనని... ఏ విషయమైనా నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడుతానని.. తనతో పెట్టుకోవద్దని మంగళవారం ఎక్స్ వేదికగా కవిత కేటీఆర్‌ను హెచ్చరించారు. "కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్టు.. పార్టీలో మీ వైఫల్యాన్ని, మీ చేతగానితనాన్ని బీఆర్ఎస్ అధినేతపై మోపుతున్నావు అంటే.. ప్రత్యక్ష రాజకీయాల్లో మీ స్థానమేంటో అర్థమవుతోందా?" అని కవిత ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఒక రైతు ఫోన్ మాట్లాడుతుంటే "నీ పెండ్లామా!? అంత అర్జెంటా!?" అని అహంకారంతో అతని భార్యను అవమానించారని.." గతంలో సాయం కోసం వెళ్లిన మహిళను "నా కోసం కన్నావా" అని ఆమె మాతృత్వాన్ని అవమానించారని కవిత గుర్తుచేశారు.

### భూముల్ని కొల్లగొడుతున్నరు..

రంగారెడ్డి జిల్లా కొంగరఖుర్దు (ఏ) గ్రామంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కలిసి రూ.5 వేల కోట్ల విలువైన 580 ఎకరాల వక్ఫ్ భూమిని కొల్లగొడుతున్నారని కవిత ఆరోపించారు. మంగళవారం టీఆర్ఎస్ కార్యాలయంలో కొంగరఖుర్దు (ఏ) గ్రామానికి చెందిన భూబాధితులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. ఆ 580 ఎకరాల్లో ఇప్పటికే 150 ఎకరాలు భూ మాఫియా చెరలోకి వెళ్లిపోయిందని.. నిషేధిత జాబితాలో ఉన్న వక్ఫ్ భూములు ఎలా రిజిస్ట్రేషన్ అయ్యాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు. వెంటనే ఆ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్బన్ క్రెస్ట్, సిటీ గ్రాండ్ ఎన్ క్యూ వెంచర్స్ అనే సంస్థలు అక్కడ భారీ వెంచర్లు వేశాయని తెలిపిన ఆమె.. నిషేధిత జాబితాలో ఉన్న ఆ భూముల్లో లే ఔట్ పర్మిషన్ ఎలా ఇచ్చారని హెచ్ఎండీఏ కమిషనర్‌ను ప్రశ్నించారు. వెంటనే ఆ ప్రాజెక్టులను నిలిపివేయాలన్నారు. 2022 నుంచి ఆ భూముల్లో కబ్జాలు మొదలయ్యాయని.. ఒక రైతు 58ఎకరాల్లో పంటలు సాగుచ్ఛస్త మూడు జేసీబీలతో పంటను ధ్వంసంచేసి లే ఔట్ వేశారని కవిత తెలిపారు. భూ మాఫియా ఆగడాలపై రెవెన్యూ, పోలీస్ అధికారులకు రైతులు ఫిర్యాదు చేసినా కనీసం కేసులు కూడా నమోదు చేయడంలేదని, ఆ గ్రామంతో సంబంధంలేని వారి పేర్లతో ఓఆర్సీలు సృష్టించి వాటితో కోర్టుల్లో కేసులు వేసి అనుకూలంగా జడ్జిమెంట్‌లు తెచ్చుకొని రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఈ భూ కబ్జాలపై 'నమస్తే తెలంగాణ'లో ఒకరోజు, 'సాక్షి' పత్రికలో ఒకరోజు కథనాలు ప్రచురితమయ్యాయని.. ఆ తర్వాత ఒక్కముక్క వార్తకూడా ఆ పత్రికల్లో రాలేదని, దాని వెనుక బీఆర్ఎస్ ముఖ్య నాయకుడు ఉన్నారని కవిత మండిపడ్డారు. సాక్షిలో భూమాఫియాకు వ్యతిరేకంగా ఆర్టికల్ వచ్చిన మర్నాడే రైతులకు వ్యతిరేకంగా కథనం రాశారని ఆమె పేర్కొన్నారు.

తనకు ఈ మధ్యనే ఒక విషయం తెలిసిందని.. అదేంటంటే.. రామన్న - జగనన్న దోస్తులు అయ్యారని, అందుకే సాక్షిలో రైతులకు వ్యతిరేకంగా కథనాలు రాశారని అన్నారు. ముందురోజు భూమాఫియాకు వ్యతిరేకంగా కథనం వస్తే.. తెల్లారే దాన్ని రైతులకు వ్యతిరేక కథనంగా మార్చడం వెనుక ఏ శక్తులు ఉన్నాయని ప్రశ్నించిన ఆమె.. బీఆర్ఎస్ దీనికి సమాధానం చెప్పి తీరాలన్నారు. ఈ రోజు కూడా కొంగరకుర్దు భూముల్లో నిషేధిత జాబితాలో ఉన్నట్టు ప్రభుత్వ రికార్డులే స్పష్టం చేస్తున్నాయన్నారు. రైతులను భయబ్రాంతులకు గురిచేస్తున్న అర్బన్ క్రెస్ట్, సిటీ గ్రాండ్ఎన్ క్యూ వెంచర్స్‌పై చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. ఆ రెండు సంస్థలు ఇకపై ఒక్కగజం మేర వెంచర్‌ను విస్తరించినా.. ఒప్పుకోబోమని, ఆ భూమి రిజిస్ట్రేషన్లను రద్దు చేయకుంటే రంగారెడ్డి కలెక్టర్, ప్రభుత్వాన్ని కోర్టుకు లాగుతానని హెచ్చరించారు.

## అన్ని ఔషధాలపై 16-శాతం మార్జిన్ పరిమితి?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: ఆసుపత్రులు క్యాన్సర్ ఔషధాలను పది రెట్ల అధిక ధరకు విక్రయిస్తుండడం పట్ల సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇది కేవలం దోపిడీ కాదని, సామాన్య ప్రజల ప్రాణాలతో ఆడుతున్న చెలగాటమని అభివర్ణించింది. అసలు 'ఔషధ ధరల నియంత్రణ చట్టం, 2013' పరిధిలో ఎసెన్షియల్ (అత్యావశ్యకం), నాన్ ఎసెన్షియల్ (అత్యావశ్యకం కానివి) అంటూ మందుల ధరల విషయంలో ఎందుకు ఈ వ్యత్యాసమని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ సందర్భంగా కేంద్రాన్ని ప్రశ్నించింది. అన్ని ఔషధాల ఎంఆర్‌పీపై 16% మార్జిన్ (కొనుగోలు-విక్రయం మధ్య వ్యత్యాసం) పరిమితి ఎందుకు విధించరాదు? అని ప్రశ్నించింది. "కార్పొరేట్ ఆసుపత్రుల్లో క్యాన్సర్ ఔషధం విక్రయ ధర రూ.27,000 ఉండగా, దీన్ని రిటైలర్‌కు (ఫార్మసీ స్టోర్) రూ.2,700కే సరఫరా చేస్తున్నారు. ఈ లాభం అంతా ఎక్కడికి వెళుతోంది? ఎవరు ప్రయోజనం పొందుతున్నారు? ఆసుపత్రులు తమ అనుబంధ ఫార్మసీల నుంచే ఔషధాలు కొనుగోలు చేయాలని నిర్దేశిస్తున్నాయి. పేషెంట్ బయట వేరే ఏదైనా స్టోర్ నుంచి తెస్తే చికిత్సకు హామీ ఇవ్వడం లేదు.

దీంతో సామాన్యులు నలిగిపోతున్నారు. ఎవరైనా ఫార్మాసిస్ట్ మానవతా దృక్పథంలో అదే ఔషధాన్ని రూ.2,700 విక్రయిస్తే.. అది నిజమైనదా? నకిలీదా? అని సందేహించేలా ఈ వ్యవస్థ మారిపోయింది. కార్పొరేట్ ఆసుపత్రులు వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయి. ఎక్కడా సేవాభావం కనిపించడం లేదు. దీనిపై కేంద్రం దృష్టి సారించాలి"అని జస్టిస్ మెహతా అన్నారు. కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. అధికారులతో ఈ అంశంపై చర్చించాల్సి ఉందని, రెండు వారాల సమయం ఇవ్వాలని కోరారు. దీంతో కోర్టు తదుపరి విచారణను అక్టోబర్ 12కు వాయిదా వేసింది.

## అమెరికాలో ఎస్సార్ గ్రూప్ భారీ పెట్టుబడులు!

చెందిన మెసాబి మెటాలిక్స్ మిన్నెసోటా కేంద్రంగా పనిచేస్తోంది. ఈ సంస్థ లోవాలో ఉక్కు కర్మాగారంతోపాటు మిన్నెసోటాలో ఇనుప ఖనిజం(ఐరన్ ఓర్) తవ్వకాలను చేపట్టనుంది. దీంతో అమెరికాలో 50ఏళ్ల తర్వాత తొలిసారి ఐరన్ ఓర్ తవ్వకాలు ప్రారంభించినట్లవుతుంది. 2030 కల్లా ఉక్కు ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు శ్వేతసౌధం, ఎస్సార్ గ్రూప్ ప్రకటించాయి. ఏడాదికి 10 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి అవుతుందని వెల్లడించాయి. తమ పెట్టుబడులతో అమెరికా, భారత్‌ల మధ్య ఆర్థిక బంధాలు మరింత బలోపేతం అవుతాయని రవి రుయా ఆకాంక్షించారు.

## ఎకరం 250 కోట్ల ఉన్న స్థలాల్లో ఇందిరమ్మ టవర్లు

- ఫ్లాట్ విలువ 80 లక్షలు.. ఏడాదిలోపే పూర్తిచేసి తాళాలిస్తాం
- రిజిస్ట్రేషన్ చార్జీల్లేకుండా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు: పొంగులేటి
- నాంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల శంకుస్థాపన

హైదరాబాద్ సెప్టెంబరు 29 తమ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వం నగరానికి 40 కి.మీ దూరంలో ఇళ్లు కట్టిస్తే పేదవాడి కష్టం తెలిసిన ప్రజా ప్రభుత్వం క్యూర్ పరిధిలోని 20 నియోజకవర్గాల్లో ఎకరా రూ.200-250 కోట్ల విలువ కలిగిన స్థలాల్లో వారి కోసం ఇందిరమ్మ ఇళ్ల టవర్లు కట్టించి అందచేస్తోందన్నారు. నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్‌లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి మంత్రులు పొంగులేటి, అజారుద్దీన్, ఎంపీ అనిల్ యాదవ్, ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడారు.గత ప్రభుత్వం పదేళ్లలో కట్టిన ఇళ్లకన్నా కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతలోనే రెట్టింపు ఇళ్లు నిర్మించి చూపిస్తోందన్నారు. తన జీవిత కాలంలో ఒక్కసారైనా సొంతింటిని చూసుకోవాలన్న పేదవాడి ఆకాంక్షను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. క్యూర్ (జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ) ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల భూములను గుర్తించి వాటిని హౌసింగ్‌శాఖకు బదలాయించి పేదల కోసం గ్రౌండ్ ప్లస్ పదంతస్తులతో అపార్ట్‌మెంట్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పారదర్శకంగా నిర్వహించిన డ్రాలో 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, మిలిలిన వారికి రెండో, మూడో, నాలుగు విడతల్లో ఇళ్లు అందిస్తామని తెలిపారు. 20 నియోజకవర్గాల్లో భూములు గుర్తించామని, సుమారు 16-17 ప్రాంతాల్లో టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు.గత ప్రభుత్వం నగరంలో పేదలు నివసించే ప్రాంతాలకు 30-40 కి.మీ దూరంలో ఇళ్లు నిర్మించడం వల్ల జీవనోపాధి కోసం వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు.

## రెండేళ్లలో పదింతల అభివృద్ధి

ఉన్న అమేజింగ్ ఫైనాన్షియల్ స్ట్రేటజీ వల్ల మాత్రమే అభివృద్ధి సాధ్యపడింది. అప్పుల కుప్పగా ఉన్న రాష్ట్రం గట్టున పడిందంటే దానికి సీఎం అనుభవం, దక్షతలే కారణం. ఉద్యమ స్ఫూర్తితో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వామ్యులు కావాలి. ప్రతి పనినీ పరిశీలించాలి. నాణ్యత పరంగా లోపం కనిపిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి" అని సూచించారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో కేవలం 880 కిమీ సీసీ రోడ్లు వేస్తే, చంద్రబాబు నాయకత్వాన ఈ ప్రభుత్వం 9వేల కిమీ సీసీ రోడ్లు నిర్మించిందని తెలిపారు. పల్లెపండుగ 1.0, 2.0లో 9వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశామని వివరించారు.పల్లెపండుగ 3.0లో 11,085 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. రూ. 50వేల కోట్లతో జలజీవన్ మిషన్ వేగవంతం చేయబోతున్నామన్నారు. 1.30 లక్షల కోట్లతో జలజీవన్, అమరజీవి జలధార పథకాల ద్వారా మల్టీ విలేజ్ స్కీం, సింగిల్ విలేజ్ స్కీం పనులు చేపడుతున్నామని, అక్టోబరు 5న ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. పల్లెపండుగ 3.0 కింద ఆరువేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9వేల కిలోమీటర్ల బీటీ రోడ్లు, మరో 22,500 మినీ గోకులాలు, 50 వేల హెక్టార్లలో పండ్ల తోటలు అభివృద్ధి చేయబోతున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బంజారా ఆవాసాల్లో ఈ పనులు ఒక మహాయజ్ఞంలా చేయబోతున్నామని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా నియోజకవర్గానికి ఒక డొంక రోడ్డును నిర్మిస్తామని, తరువాత మిగిలిన రోడ్లను కూడా దశలవారీగా నిర్మిస్తామని చెప్పారు.

## నేడు విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం'

తెలిసిందే. అదేస్థాయిలో విజయవాడలోనూ కార్యక్రమం నిర్వహించనున్నారు. సింగ్‌నగర్‌లోని ఎంబీవీ కే స్టేడియం వేదికగా జరిగే ఈ కార్యక్రమంలో మొత్తం 24,057 మంది నిరుపేదలు సుమారు రూ.24,297 కోట్ల విలువైన నివేశన స్థలాలపై సర్వహక్కులు పొందనున్నారు.దీనికోసం ప్రభుత్వం జీవో 615 జారీ చేసింది. జీవో 30, జీవో 306 ద్వారా అక్షేపణ లేని ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఉంటున్న వారి స్థలాలను క్రమబద్ధీకరించింది. దీంతో జిల్లావ్యాప్తంగా 617 ఎకరాల పరిధిలోని 29.86 లక్షల చదరపు గజాల్లో ఇళ్ల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఒక్కో కుటుంబానికి రూ.40లక్షల నుంచి రూ.45 లక్షల వరకు లబ్ధి చేకూరనుందని అంచనా వేస్తున్నారు. విజయవాడ నగరంలోని కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ప్రభుత్వం శాశ్వత పట్టాలు మంజూరు చేస్తోంది

THARANGALU DAILY NEWS
బుధవారం, 30 సెప్టెంబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## బాధిత గొర్రెల కాపరికి అండగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 29 తరంగాలు**
పోచంపల్లి మండలం జూలూరు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కృష్ణయ్య కె పాల్ కొండమడుగు సమీపంలో గొర్రెల పైకి రైలు దూసుకెల్లడంతో సుమారు 350 గొర్రెలు మృతి చెందడం అత్యంత విషాదకరం.ఈ విషయం తెలిసిన వెంటనే స్పందించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడు కృష్ణయ్యను పరామర్శించారు.బాధిత కుటుంబానికి తక్షణ అండగా నిలుస్తూ 1 లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.అంతే కాకుండా రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి,అలాగే షీప్ అండ్ గోట్ ఫెడరేషన్ చైర్మన్ మరియు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధిత గొర్రెల కాపరికి ప్రభుత్వపరంగా నిబంధనల ప్రకారం పూర్తి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## బాలికల హాస్టలను సందర్శించిన ఎంపీడీవో



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి సెప్టెంబర్ 29 తరంగాలు**
వలిగొండ మండల పరిధిలోని లొతుకుంట గ్రామంలో బాలికల హాస్టల్‌ను మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి సందర్శించి హాస్టల్‌లోని పరిసరాలను, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. హాస్టల్‌లో నిర్వహిస్తున్న సరుకుల నాణ్యత, పరిమాణాన్ని స్వయంగా తనిఖీ చేశారు.అనంతరం విద్యార్థులతో ఫుడ్ కమిటీ సభ్యులతో మాట్లాడి హాస్టల్‌లో వారికి ఎదురవుతున్న సమస్యలు,ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు,భోజన నాణ్యతపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.అలాగే ఆదివారం కూడా తప్పనిసరిగా స్టాఫ్ అందుబాటులో ఉండాలి అని సూచించారు.మధ్యాహ్న భోజన సమయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి తో కలిసి గ్రామ సర్పంచ్ గండు రాములు విద్యార్థులకు భోజనం వడ్డించారు.అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి,వారికి అందుతున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు.విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు,నాణ్యమైన ఆహారం అందేలా సంబంధిత సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని,ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రాంతి,హాస్టల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మామునూరు విమానాశ్రయానికి డా. బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాలి

- పెట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సంఘాలతో కలిసి ధర్నాలు
- మాస్ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు మాదిగ



**వర్ధన్నపేట ప్రతినిధి , సెప్టెంబర్ 29 (తరంగాలు):**
మామునూరు విమానాశ్రయానికి భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాలని మాస్ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.మామునూరు విమానాశ్రయానికి డా. బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టే విషయంలో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. అంబేద్కర్ పేరు పెట్టని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సంఘాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాస్ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు ఈరెల్లి శ్రీనివాస్ మాదిగ, బీసీ సంక్షేమ సంఘం వర్ధన్నపేట నియోజకవర్గ కార్యదర్శి మామిండ్ల చెన్నయ్య యాదవ్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జన్ను నర్సయ్య మాదిగ, అంబేద్కర్ సంఘం వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ జంగిలి భాస్కర్ మాదిగతో పాటు పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# తరాల మధ్య అనుబంధాన్ని బలోపేతం చేయాలి : అంగన్వాడీ సూపర్వైజర్ చంద్రకళ





- ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

**వర్ధన్నపేట ప్రతినిధి , సెప్టెంబర్ 29, తరంగాలు :** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా వర్ధన్నపేట మండలం బండౌతపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల సమీపంలో ఉన్న వయోవృద్ధులతో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంగన్వాడీ సూపర్వైజర్ చంద్రకళ హాజరై వయోవృద్ధులతో ముచ్చటించి వారి అనుభవాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబంలో వయోవృద్ధులు విలువైన మార్గదర్శకులని, వారి అనుభవాలు భావితరాలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. పిల్లలు, యువత వయోవృద్ధులను గౌరవిస్తూ వారితో ఆత్మీయంగా మెలగాలని సూచించారు.

### తరాల మధ్య అనుబంధం బలపడాలి

పిల్లలు--తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మల మధ్య అనుబంధాన్ని పెంపొందించేలా పలు చిన్న చిన్న ఆటలు, వినోద కార్యక్రమాలు, ఆక్టివిటీలను నిర్వహించారు. పిల్లలు, వయోవృద్ధులు కలిసి ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది. వయోవృద్ధులతో పిల్లలు సమయం గడపడం ద్వారా కుటుంబ విలువలు, మానవీయ సంబంధాల ప్రాధాన్యతను తెలుసుకునే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

### వయోవృద్ధుల సంరక్షణ ప్రతి కుటుంబ బాధ్యత

వయోవృద్ధులను నిర్లక్ష్యం చేయకుండా వారికి అవసరమైన ప్రేమ, గౌరవం, భద్రత, వైద్య సహాయం అందించడం ప్రతి కుటుంబ సభ్యుడి బాధ్యత అని చంద్రకళ సూచించారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణకు సంబంధించిన చట్టపరమైన అంశాలపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వయోవృద్ధుల పట్ల నిర్లక్ష్యం, వేధింపులు చోటుచేసుకుంటే చట్టపరమైన చర్యలు ఉండే విషయాన్ని కూడా వివరించారు.

వయోవృద్ధులకు ఏదైనా సహాయం, సమాచారం లేదా సమస్య ఉంటే 14567 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. వయోవృద్ధుల హక్కులు, గౌరవప్రదమైన జీవనం, భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు.

అనంతరం వయోవృద్ధులు, పిల్లలతో కలిసి వయోవృద్ధులను గౌరవించడం, వారి సంక్షేమానికి తోడ్పడడం, కుటుంబంలో ఆత్మీయ వాతావరణాన్ని కొనసాగించడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అమరేందర్ , అంగన్వాడీ టీచర్లు వజ్రమ్మ, బుజ్జమ్మ ,ఆయా సుశీల , వయోవృద్ధులు,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టరేట్ రెడీ ప్రారంభానికి ప్రభుత్వం నాట్ రెడీ





- వరంగల్ తూర్పు ప్రజలను ఇంకా హన్మకొండకే తిప్పుతారా
- వరంగల్‌లో కలెక్టరేట్ ఉన్నా.. పాలన హన్మకొండలోనేనా
- పదవుల పందెం చాలూ.. ప్రజల సమస్యలు పట్టించుకోండి
- కలెక్టరేట్‌కు తాళం ఎందుకు? ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రదీప్ రావు
- సిటీ క్యాంపు కార్యాలయం నుంచి నూతన వరంగల్ జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ
- బూడిద గుమ్మడికాయలు కొట్టి,దిష్టి తీస్తూ బీజేపీ నిరసన
- కలెక్టరేట్ ప్రారంభించండి... వరంగల్ ప్రజల కష్టాలు తీర్చండి
- బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు

**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 29 (తరంగాలు):** వరంగల్‌లో నూతన కలెక్టరేట్ భవనం ప్రారంభానికి రెడీగా ఉన్నా... దానిని ప్రారంభించడానికి ప్రభుత్వం రెడీగా లేకపోవడంతో వరంగల్ జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యేను ప్రశ్నిస్తూ బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. సిటీ క్యాంపు కార్యాలయం నుంచి నూతన వరంగల్ జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టిన అనంతరం కలెక్టరేట్ ఎదుట బూడిద గుమ్మడికాయలు కొట్టి దిష్టి తీస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ, భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ నూతన వరంగల్ జిల్లా కలెక్టరేట్‌ను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లా వరంగల్‌లో ఉన్నప్పటికీ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల పనుల కోసం హన్మకొండకు వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందని నిలదీశారు. ఏ శాఖ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు చెప్పుకునేందుకు హన్మకొండ చుట్టూ తిరగాల్సి వస్తోందని అన్నారు.కుటుంబంలో ఎవరికి ఏ పదవి రావాలి, ఎవరు ఎమ్మెల్సీ కావాలి, ఎవరు ఎమ్మెల్యే కావాలి అనే ఆరాటం ఉంటే ఎన్ని పదవులు కావాలంటే అన్ని తీసుకోవచ్చని, కానీ ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికి వినియోగించాలని ఆయన అన్నారు. "మిమ్మల్ని గెలిపించిన వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలకు మీరు ఏం న్యాయం చేస్తున్నారు?" అని ప్రశ్నించారు.నెలలో కనీసం 20 రోజులైనా తూర్పు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వినాల్సిన బాధ్యత ఉందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పదవులు కోరుకోవడం కాకుండా, ప్రజల సమస్యలు పరిష్కరించే సమయంలో కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.కాకతీయుల చారిత్రక రాజధానిగా పేరొందిన వరంగల్‌లో నిర్మించిన నూతన కలెక్టరేట్ ముందు కాకతీయ కీర్తి తోరణం లేకపోవడం ప్రజల మనోభావాలను దెబ్బతీసే అంశమని ప్రదీప్ రావు అన్నారు. పూర్తయిన కలెక్టరేట్‌ను వెంటనే ప్రారంభించి జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలను వరంగల్‌లో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు."పదవుల కోసం రాజకీయాలు చేయడం కాదు.. ప్రజల కోసం పనిచేయాలి. వరంగల్ తూర్పు ప్రజలకు అందుబాటులోకి రావాలి. పూర్తయిన కలెక్టరేట్‌ను వెంటనే ప్రారంభించాలి. ప్రజలను ఇంకా ఎన్నాళ్లు హన్మకొండకు తిప్పుతారు?" పదవుల పందెం చాలు ఇకనైనా ప్రజల సమస్యలు పట్టించుకోండి...అని ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్ధం నరేష్, జలగం రంజిత్, సీనియర్ నాయకులు కుసుమ సతీష్, వంగాల సమ్మిరెడ్డి, రత్నం సతీష్ షా, తాజా మాజీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, గోకుల రాణా ప్రతాప్ రెడ్డి తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
బుధవారం, 30 సెప్టెంబర్ , 2026



## ఉర్సుగుట్ట రెసిడెన్షియల్ స్కూల్‌లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

- 50 మంది విద్యార్థులకు టీకాలు.. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై అవగాహన
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.బి. రాజా రెడ్డి



**వరంగల్ ప్రతినిధి , సెప్టెంబర్ 29 (తరంగాలు):** ఉర్సుగుట్టలోని ఎంజెపిటిబిసిడబ్ల్యు రెసిడెన్షియల్ స్కూల్‌లో హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ/పీవో (సీహెచ్‌ఐ) డా. ప్రకాష్‌తో కలిసి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. యూపీహెచ్‌సీ ఎస్‌ఆర్‌ఆర్ తోట ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 14--15 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రాముఖ్యత, ప్రయోజనాలు, హెచ్‌పీవీ వల్ల కలిగే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో టీకా పాత్రపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం 50 మంది విద్యార్థులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డా. బి. రాజా రెడ్డి మాట్లాడుతూ.. కిశోర బాలికల ఆరోగ్య పరిరక్షణలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కీలకమని తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు వ్యాక్సినేషన్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అర్హులైన విద్యార్థులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డా. అరుణ్ జోషి, పీవో (ఎన్‌టీఈపీ), డా. అనిత, యూపీహెచ్‌సీ ఎస్‌ఆర్‌ఆర్ తోట వైద్యాధికారి, రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# పర్వతగిరి, చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్లకు ఘన సన్మానం





**పర్వతగిరి, సెప్టెంబర్ 29 (తరంగాలు ప్రతినిధి ):** వరంగల్ జిల్లా పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్‌గా పిన్నింటి అనిల్ రావు, చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా అత్తి కుమారస్వామి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పర్వతగిరి శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు చైర్మన్లను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పిన్నింటి అనిల్ రావు మాట్లాడుతూ యాదవ సోదరులకు సహకార సంఘం ద్వారా సహాయం, సహకారం అందించడంతోపాటు పారదర్శకంగా పనిచేస్తామని అన్నారు. అదేవిధంగా గొర్రెలు మేకలు, పశువుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యాదవ సంఘం సమస్యలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి తీసుకువెళ్లి మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి, యాదవ సంఘం నాయకులు గరుగు రాజు, ఎరసాని సారయ్య, జంగ కుమార్, మట్ట పెద్ద కుమార్, జంగ లింగమూర్తి, సకినాల వెంకన్న, జంగ మల్లేశం, గొలుసుల సుధాకర్, జంగ వీరమల్లు, ఆదోండ బిక్షపతి, ముక్కెర సుధాకర్, మధుగాని శ్రీకాంత్, జంగ శ్రీశైలం, ఎరసాని అశోక్, మట్ట సతీష్, జంగ సాంబయ్య, రామసాని సాయిలు, ఇదిగాని సంతోష్, బిక్షపతి, మార్క కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు మాజీ ఎంపీ నామ శ్రీకారం



- కుటుంబ సభ్యుల వివరాలు నమోదుతో గ్రాడ్యుయేట్ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్
- అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటర్లుగా నమోదు కావాలి

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 29 :** వరంగల్--ఖమ్మం--నల్గొండ నియోజకవర్గం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా బీఆర్‌ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఓటర్ల నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో ముందుగా తన కుటుంబ సభ్యుల గ్రాడ్యుయేట్ వివరాలను నమోదు చేయించారు. నామ సతీమణి చిన్నమ్మ, కుమారులు పృథ్వి తేజ, భవ్య తేజ ల తో పాటు కమ్మ రవి, కమ్మ జ్యోత్స్న, కిలారి ఉదయ్, రమ్యకృష్ణ, నామ సాయిరాం, కావ్య, రవీందర్, ప్రసన్న కుమారి తదితర 15 మంది కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయించారు. అనంతరం పలువురు గ్రాడ్యుయేట్ల వివరాల నమోదుకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 30 మంది గ్రాడ్యుయేట్ల వివరాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పిస్తూ, అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు కీలకమైనందున అర్హులైన పట్టభద్రులందరి వివరాలను సేకరించి నమోదు చేయించే దిశగా బీఆర్‌ఎస్ శ్రేణులు పనిచేయాలని నామ సూచించారు. ఖమ్మం నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో ఆయా ప్రాంతాల్లో ఉన్న గ్రాడ్యుయేట్లను సంప్రదించి, నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. ఇటీవల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా గ్రాడ్యుయేట్ ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్‌పై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన నేపథ్యంలో నామ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గడువు లోపు గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టి, అర్హులైన వారందరి వివరాలను నమోదు చేయించాలని నామ సూచించారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా టీం ఈ ఎన్‌రోల్మెంట్ డ్రైవ్‌లో చురుగ్గా పాల్గొని, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌తో దరఖాస్తు చేయించాలని నామ సూచించారు.

# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి






- మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**హన్మకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 29,తరంగాలు:** యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కొంతమంది యువత సరదా, స్నేహితుల ప్రభావం, ఆసక్తి వంటి కారణాలతో మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ఒకటి రెండు సార్లు తీసుకుంటే ఏమవుతుందనే నిర్లక్ష్య ధోరణి ప్రమాదకరమని, అదే క్రమంగా వ్యసనంగా మారి జీవితాన్ని నాశనం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల భవిష్యత్తు అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. మాదకద్రవ్యాలు కేవలం శరీరానికి మాత్రమే హాని చేయవని, అవి మొత్తం కుటుంబాన్ని, సామాజిక సంబంధాలను, మానసిక ఆరోగ్యాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తాయన్నారు. యువత తమ విలువైన జీవితాన్ని మత్తు పదార్థాలకు బలి చేయకుండా లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. మాదక ద్రవ్యాలు అనేది సమాజానికి పెద్ద సమస్యగా మారిందని, ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నిలబడినప్పుడే ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోగలమని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని భవిష్యత్తును కాపాడుకోవాలని విద్యార్థులు, యువతకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే వ్యక్తి శారీరకంగా, మానసికంగా, సామాజికంగా నష్టపోతారని తెలిపారు. విద్యార్థులు తమ స్నేహితుల్లో ఎవరైనా మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నట్లు గుర్తిస్తే వారిని చైతన్యపరచి సరైన మార్గంలోకి తీసుకురావాలని సూచించారు. కళాశాలలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ సంచాలకులు ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ... జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవా భావన, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలని, తమతో పాటు సమాజంలోని ఇతరులను కూడా చైతన్యపరచాలని కోరారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎన్. రెహమాన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం విద్యార్థుల భవిష్యత్తును మాత్రమే కాకుండా వారి కుటుంబాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. యువత క్రీడలు, విద్య, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవ వంటి సానుకూల కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ కుమార్‌స్వామి మాట్లాడుతూ... మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే చట్టపరమైన, ఆరోగ్యపరమైన, సామాజిక పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసినప్పుడు బాధ్యతాయుతంగా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. యువత అప్రమత్తంగా ఉండి మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ రమేష్, డాక్టర్ చందర్, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## సీఎం పర్యటన ఏర్పాట్లపై కూన శ్రీశైలం గౌడ్ సమీక్ష

**సిరిసిల్ల, సెప్టెంబర్ 29 (తరంగాలు ప్రతినిధి ):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సిరిసిల్ల పట్టణంలో నిర్వహించనున్న పర్యటన నేపథ్యంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్ తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం పర్యటనకు సంబంధించిన జన సమీకరణ, సభా ఏర్పాట్లు, ఇతర కార్యక్రమాల నిర్వహణపై నాయకులతో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేస్తూ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేయాలని కూన శ్రీశైలం గౌడ్ సూచించారు. ఈ సమావేశంలో తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు




మునిగే రాజు, సర్ కోఆర్డినేటర్ ప్రవీణ్ టోనీతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
బుధవారం, 30 సెప్టెంబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 29 తరంగాలు**
వలిగొండ మండల పరిధిలోని గ్రామాలలో అనారోగ్యాలతో బాధపడుతూ చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైన మండల పరిధిలోని గ్రామాలలోని 89 మంది లబ్ధిదారులకు 52 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మంజూరు చేయించారు. లబ్ధిదారులకు మండల పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్ వలిగొండ మండల కేంద్రంలో మంగళవారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి,సీనియర్ నాయకులు తుమ్మల యుగంధర్ రెడ్డి,కాసుల వెంకన్న,ఎలిమినేటి సత్యనారాయణ, వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు దండే మల్లికార్జున్,కురుమ సంఘం అధ్యక్షులు కూనపూరి శంకరయ్య, ఎమ్మె లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ అభివృద్ధి సంస్థకు కొత్త కార్యనిర్వాహక సంచాలకురాలు

• **బాధ్యతలు స్వీకరించిన పి. విజయలక్ష్మి**



**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ సెప్టెంబర్ 29**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సీ సేవా సహకార అభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక సంచాలకురాలిగా పి. విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణకొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా షెడ్యూల్డు కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకురాలిగా పి. విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు.జిల్లా కలెక్టర్, జిల్లా షెడ్యూల్డు కులముల సేవా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు పి. విజయలక్ష్మిని కార్యనిర్వాహక సంచాలకురాలిగా నియమించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, సంస్థ చైర్మన్ సమక్షంలో ఆమె అధికారికంగా విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటివరకు కార్యనిర్వాహక సంచాలకులుగా విధులు నిర్వహించిన శ్రీ ఆర్. ఉపేందర్‌రావు నుంచి పి. విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె కార్యాలయ కార్యకలాపాలను పరిశీలించి, సంస్థ పరిధిలో కొనసాగుతున్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న సేవలు తదితర అంశాలపై దృష్టి సారించారు.జిల్లా షెడ్యూల్డు కులముల సేవా సహకార అభివృద్ధి సంస్థ ద్వారా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.పి. విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సంస్థ అధికారులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## అన్నపురెడ్డిపల్లి మండలంలో కలెక్టర్ అంకిత్ విస్తృత పర్యటన

• **నరసాపురంలో భూ రీ సర్వే పరిశీలన -- గురుకులాల్లో ఆకస్మిక తనిఖీలు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ సెప్టెంబర్ 29**
అన్నపురెడ్డిపల్లి: మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. నరసాపురం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను పరిశీలించి, భూముల వివరాలను రికార్డుల ఆధారంగా పక్కాగా నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన విస్తీర్ణం, హక్కుదారులు, సంబంధిత శాఖల రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.అనంతరం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల, గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలలు, ఆహార పదార్థాల నాణ్యత, మెనూ అమలు, పారిశుధ్యం, విద్యార్థులకు అందుతున్న వసతులను పరిశీలించారు.విద్యార్థుల భద్రత, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. వంటశాలల్లో పరిశుభ్రత పాటిస్తూ, ఆహార కలుషితం, ఫుడ్ పాయిజనింగ్‌కు తావులేకుండా పటిష్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ పర్యటనలో తహసీల్దార్ స్వర్ణ, గురుకులాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సర్వే సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ కృత్రిమ మేధస్సు బాగా ఉపయోగపడుతుంది





• **విశ్రాంత ఐపిఎస్ అధికారి, మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్**
• **సి. పార్ధసారధి అన్నారు.**

**నల్గొండ-- సెప్టెంబర్19, (తరంగాలు )**
మంగళవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉదయాదిత్య భవన్లో ఎంఈఓ లు, స్కూల్ అసిస్టెంట్లు ,ఎమ్మార్పీలు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ లకు ఉద్దేశించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా మెరుగైన బోధన పై ఏర్పాటు చేసిన వర్క్ షాప్ కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాలానుగుణంగా సాంకేతికత పెరుగుతూ వస్తున్నదని, అదే సమయంలో బోధించే విధానంలో కూడా మార్పులు వస్తున్నాయని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చిన తర్వాత విద్యార్థులకు బోధించడంలో ఉపాధ్యాయుల పాత్ర పై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ చాలా శక్తివంతమైన ఆయుధమని, దీన్ని ఎంత బాగా సద్వినియోగం చేసుకుంటే అంత ఫలితం ఉంటుందని, ఇది ఒక రకంగా చెప్పాలంటే మంచి సహాయకుడిగా పనిచేస్తుందని, వృత్తిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ని ఎలా వాడుకోవాలో ఆలోచించాల్సి ఉందని అన్నారు. ప్రస్తుతం ప్రతి రంగంలో, ప్రతి ఒక్కరు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై ఆధారపడుతున్నారని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో విద్యార్థులకు మంచి విద్యను అందించడంతో పాటు, పాఠశాలలకు సంబంధించిన సమాచారాన్ని, నివేదికలను వేగంగా రూపొందించే అవకాశం ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కి పసివాడు మనసు తెలుసుకోవడం చాలా కష్టమని, కానీ ఉపాధ్యాయుడు పిల్లల మనసును బాగా అర్థం చేసుకుంటారని, ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయుల మేధస్సుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తోడైతే ఇంకా మంచి బోధనను అందించవచ్చున్నారు .సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులకు ఉంటుందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై అవగాహన లేకపోతే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వచ్చినవారు ఎదుటి వ్యక్తులను మోసం చేసే అవకాశం ఉందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తు లో విద్యార్థులకు నవీకరించిన జ్ఞానాన్ని అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా మారాల్సిన అవసరం ఉందని, ప్రతిరోజు బోధనతోపాటు, పాఠశాలకు సంబంధించిన వివిధ అంశాలతో పని భారం పెరుగుతున్నదని, ప్రత్యేకించి రిపోర్టు, ఎఫ్ఆర్ఎస్ ,అటెండెన్స్, మిడ్ డే మీల్స్ ,ఫిజిక్స్ వాలా తదితర రిపోర్టుల తయారీకి ఏఐని ఎలా వినియోగించుకోవాలో ఉపాధ్యాయులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా చేయవచ్చుని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ ను వినియోగించుకొని ప్రతిరోజు కార్యక్రమాలను సులభంగా చేసుకోవచ్చో ఆలోచించాల్సిన అవసరం ఉందని అన్నారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, ఎస్ సి ఈ ఆర్ టి రిసోర్స్ పర్సన్ లక్ష్మీనాదం, తదితరులు ఉన్నారు. జారీ చేసిన వారు సహాయ సంచాలకులు, సమాచార శాఖ నల్గొండ.

# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి





• **సర్పంచ్ తొర్రి పద్మ యాదవ్**

**పర్వతగిరి, సెప్టెంబర్ 29 (తరంగాలు ప్రతినిధి ):**వయోవృద్ధుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఏనుగల్లు గ్రామ సర్పంచ్ తొర్రి పద్మ యాదవ్ అన్నారు.పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామంలో అంగన్వాడీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ తొర్రి పద్మ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వయోవృద్ధులు కుటుంబానికి, సమాజానికి విలువైన మార్గదర్శకులని, వారి అనుభవాలు భావితరాలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ ఆప్యాయత, గౌరవంతో వ్యవహరించడంతో పాటు వారి ఆరోగ్యం, భద్రత, అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వృద్ధులు ఒంటరితనానికి గురికాకుండా కుటుంబ సభ్యులు వారికి అండగా నిలవాలని సూచించారు.అనంతరం వృద్ధులను ఆత్మీయంగా పలకరించి, కేక్ కట్ చేయించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు అరుణ,వినోద, అనిత, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి వ్యాఖ్యాలపై ఇల్లందులో బిజెపి శ్రేణులు ఆగ్రహం





• **హిందువుల మనోభావాలు కించ పరిచారంటూ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం**

**ఇల్లందు ప్రతినిధి సెప్టెంబర్ 29, ( తరంగాలు):**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాముడు ధనికుల దేవుడు,శివుడు పేదల దేవుడు అని అర్థం లేని మాటలు మాట్లాడుతూ, ఓట్ల కోసం,కుర్చీ కోసం మాట్లాడడం హిందువుల మనోభావాలను కించపరిచినందుకు నిరసనగా ఈ రోజు స్థానిక భగత్ సింగ్ సెంటర్ బుగ్గవాగు వద్ద దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేసిన బిజెపి, ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు దోమల మహేశ్వర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నాయకులకు హిందూ ధర్మం మీద విషం చిమ్మడం పరిపాటిగా మారిందని,కుర్చీ కోసం,ఓట్ల కోసం దిగజారి మాట్లాడిన రేవంత్ రెడ్డి బేషరతుగా హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.హిందువులను ఎంత కించపరిచినా వచ్చే ఎన్నికల్లో దేశమంతా కాంగ్రెస్ కు బుద్ధి చెప్పి అధికారంలోకి రాకుండా ప్రజలు శిక్షిస్తారని అన్నారు. దేవుళ్ళను కూడా పేద,ధనిక అని విభజించడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడు తనానికి,రేవంత్ రెడ్డి అజ్ఞానానికి నిదర్శనమని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు సుచిత్ర పాసి,సీనియర్ నాయకులు మిరియాల వెంకటేశ్వర్లు, మహిళా మోర్చా జిల్లా నాయకురాలు పెద్దబోయిన సునీత,కార్యదర్శి రాజ్ కుమార్ పాసి,ఓరుగంటి నరసింహారెడ్డి (పండు),భజరంగ్ దళ్ నాయకులు ప్రశాంత్,బొడ్డుపల్లి అఖిల్, సంతోష్, రాజు, రవి లు పాల్గొన్నారు

## ఖమ్మం జిల్లాలో నూతన నాయకత్వాన్ని తయారు చేస్తూ యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తున్నాం

- యువజన కాంగ్రెస్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వేజెండ్ల



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో,సెప్టెంబర్ 29:**
ఖమ్మం: యువజన కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తూ, నూతన యువ నాయకత్వాన్ని తయారు చేయడానికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్ల సాయి కుమార్ తెలిపారు.యువజన కాంగ్రెస్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో భాగంగా ఖమ్మం జిల్లాలో గత ఆరు నెలలుగా నిర్వహించిన కార్యకలాపాల నివేదికను యువజన కాంగ్రెస్ జాతీయ ఇన్‌చార్జ్ మనీష్ శర్మ తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో వేజెండ్ల సాయికుమార్ సమర్పించారు.ఈ సందర్భంగా వేజండ్ల సాయి మాట్లాడుతూ, గత ఆరు నెలల్లో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఖమ్మం జిల్లాలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అదే విధంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రజలతో కలిసి పనిచేశామని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కూడా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చురుకుగా పనిచేస్తున్నారని తెలిపారు.రాబోయే రోజుల్లో గ్రామస్థాయి నుంచి యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి, ప్రతి గ్రామంలో యువతను భాగస్వాములను చేస్తూ నూతన నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని సాయికుమార్ వెల్లడించారు.ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై సమర్పించిన నివేదికను పరిశీలించిన యువజన కాంగ్రెస్ జాతీయ ఇన్‌చార్జ్ మనీష్ శర్మ మరియు తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి వేజండ్ల సాయి ను అభినందించారు.




# సర్‌పై భగ్గుమన్న అధికార పక్షం






- ఓట్ల చోరీకి నిరసనగా ఖమ్మం ధర్నా చౌక్‌లో కాంగ్రెస్ మహా ధర్నా
- సీఈసీ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం
- రాజీనామాకు డిమాండ్

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో,సెప్టెంబర్ 28:**
ఖమ్మం : ఏఐసీసీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు ఖమ్మం ధర్నా చౌక్ వద్ద జిల్లా కాంగ్రెస్ మహా ధర్నా నిర్వహించింది.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్,అర్బన్ జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తీరుపై నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం ఈ మేరకు అధికారులకు మెమొరాండం సమర్పించారు.ఈ కార్యక్రమానికి శాసనమండలి మాజీ సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు కొత్త సీతారాములు, దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, మొక్క శేఖర్ గౌడ్, అసిఫ్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్,నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా ఈ ధర్నా చేపట్టినట్లు తెలిపారు.ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించరాదని, ప్రతి అభ్యంతర దరఖాస్తును సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమైనదని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలిచేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలని అన్నారు.
రాహుల్ గాంధీని భావి భారత ప్రధానిగా చూడటానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ పిలుపు మేరకు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు వడ్డెబోయిన నరసింహారావు,రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బానోత్ బాలాజీ నాయక్,ఆత్మ కమిటీ చైర్మన్లు మట్టూరి వేంకటేశ్వరరావు,దిరిశాల చిన్న వేంకటేశ్వరరావు, కర్నాటి కోటేశ్వరరావు,మార్కెట్ చైర్మన్లు వెన్నుపూసల సీతారాములు,మాజీ కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వరరావు,దుద్దుకూరి వేంకటేశ్వరరావు,మిక్కిలినేని మంజుల నరేంద్ర, లకవత్ సైదులు నాయక్,ముక్తార్,కమర్తపు మురళి,పల్లెబోయిన భారతి చంద్రం,పైడిపల్లి సత్యనారాయణ, కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు రంగా జనార్ధన్, ఖాజా మురళి, ఏలూరి రవికుమార్ ఏలూరి రవికుమార్, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు , బ్లాక్ మండల పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,ప్రజాస్వామిక వాదులు ,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి లు కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేసిన శ్రేణులు అందరికి కృతజ్ఞతలు,ధన్యవాదాలు తెలిపారు.

## లక్ష్మీపురం మార్కెట్ నుంచి రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా అశోక్ బాబు

- 16ఏళ్ల సేవా ప్రస్థానానికి మరో గౌరవం..
- మార్కెట్ ముద్దుబిడ్డ
- అశోక్ బాబు ఎన్నికపై వ్యాపార వర్గాల నిరాజనం
- పుష్పగుచ్చాలు, శాలువాతో ఘన సత్కారం

**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 29 (తరంగాలు):**
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బేతి అశోక్ బాబును వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ వర్తక సంఘం, పరపతి సంఘం, కమిషన్ వ్యాపారస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.
లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌కు చెందిన హోల్‌సేల్ వ్యాపారి, సహచర నాయకుడైన బేతి అశోక్ బాబు అంచెలంచెలుగా ఎదుగుతూ సామాజిక సేవా రంగంలో తనదైన గుర్తింపు తెచ్చుకున్నారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. జిల్లా స్థాయి సేవా సంస్థ అయిన రెడ్‌క్రాస్‌కు చైర్మన్‌గా ఆయన ఎన్నిక కావడం మార్కెట్‌కు గర్వకారణమని అన్నారు.బేతి అశోక్ బాబు వరంగల్ జిల్లా కూరగాయల మార్కెట్ సెక్రటరీగా 16 సంవత్సరాలు సేవలందించడంతో పాటు, మార్కెట్ పరపతి సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాంకీ విల్లా ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా, వరంగల్ పద్మశాలి జిల్లా యువజన అధ్యక్షుడిగా, చేయూత స్వచ్ఛంద సేవా సంఘం ఉపాధ్యక్షుడిగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ సామాజిక సేవలో కొనసాగుతున్నారు.
రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా పేదలు, బాధితులు, ఆపదలో ఉన్నవారికి మరింత మెరుగైన సేవలు అందించాలని మార్కెట్ వర్గాలు ఆకాంక్షించాయి. ప్రజా సేవలో బేతి అశోక్ బాబు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి శ్రీనివాస్, మల్లూరి బాబురావు, సోలా శ్రీనివాస్, దౌలత్ బాజీ, రవికాసర్ల రాజు, రేపల్లె రాజు, శీలం సత్యనారాయణ, దేవరపల్లి భద్రయ్య, వలిశెట్టి మురళి, ఎస్కే అమర్, గుర్రాల మోహన్, బేతి రాజు, పరిషవీరన్న, కొండా హరి, నల్లదిగల కుమార్, బిజ్జా శ్రీహరి, జోగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# అధికారుల తప్పిదానికి పేద కార్మికులకు తప్పని తిప్పలు






- అవుట్‌సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపించి ఇందిరమ్మ ఇళ్ల జాబితాలోకి నెట్టడంపై ఆగ్రహం
- ఫిర్యాదులు చేస్తే కలెక్టర్ పీడీ--కమిషనర్ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారంటూ కార్మికుల ఆవేదన
- రికార్డు తప్పిదాన్ని వెంటనే సరిచేసి అర్హులైన కార్మికులను నా1లోకి తీసుకురావాలి

**ఇల్లందు ప్రతినిధి, సెప్టెంబర్29,( తరంగాలు ) :** పేదల సొంతింటి కలను సాకారం చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అధికారుల నిర్లక్ష్యం, రికార్డుల నిర్వహణలో జరిగిన తప్పిదం కారణంగా అర్హులైన మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.ఇల్లందు మున్సిపాలిటీ వాటర్ సప్లై విభాగంలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడం వల్ల వారి పేర్లు ఇందిరమ్మ ఇళ్ల నా3 జాబితాలోకి వెళ్లాయని వారు తెలిపారు. తాము ప్రభుత్వ ఉద్యోగులు కాదని తెలిసినప్పటికీ రికార్డుల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా చూపించడం వెనుక అధికారుల నిర్లక్ష్యం కారణమని కార్మికులు ఆరోపించారు.ప్రభుత్వ ఉద్యోగులు కాకపోయినా.. ప్రభుత్వ ఉద్యోగుల ముద్ర ఎందుకు? ఏళ్ల తరబడి అతి తక్కువ వేతనాలతో అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తూ, పట్టణ ప్రజలకు ప్రతిరోజూ తాగునీటి సరఫరా వంటి అత్యవసర సేవలు అందిస్తున్నామని వారు తెలిపారు. తమ ఉద్యోగ స్వరూపం మున్సిపల్ రికార్డుల్లో స్పష్టంగా ఉన్నప్పటికీ, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనలో మాత్రం ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడం వల్ల తమ సొంతింటి కలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. “ప్రభుత్వ ఉద్యోగం లేదు.. ప్రభుత్వ ఉద్యోగి జీతం లేదు.. ప్రభుత్వ ఉద్యోగి హోదా లేదు.. అయినా రికార్డుల్లో మాత్రం ప్రభుత్వ ఉద్యోగులుగా ఎలా నమోదు చేశారు?” అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు... సమస్య పరిష్కారం కోసం పలుమార్లు జిల్లా కలెక్టర్, పీడీ, మున్సిపల్ కమిషనర్ తదితర అధికారు లను కలిసి వినతిపత్రాలు అందించినా ఇప్పటివరకు తమ సమస్య పరిష్కారం కాలేదని కార్మికులు వాపోయారు.
“పీడీ కార్యాలయానికి వెళ్తే మున్సిపల్ కమిషనర్ పరిధిలోని అంశమని చెబుతున్నారు. కమిషనర్ కార్యాలయానికి వెళ్తే పీడీ ద్వారా పరిష్కరించుకోవాలని చెబుతున్నారు.అధికారులు ఒకరిపై ఒకరు బాధ్యతను నెట్టుకుంటూ మమ్మల్ని కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారు తప్ప మా సమస్యను పరిష్కరించడం లేదు” అని కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.తప్పు చేసిన అధికారులు కాదు.. శిక్ష అనుభవించేది పేద కార్మికులా? అధికారుల రికార్డు తప్పిదానికి పేద కార్మిక కుటుంబాలు ఎందుకు నష్టపోవాలని వారు ప్రశ్నించారు.... తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా ఉన్న పరిస్థితుల్లో సొంత ఇల్లు వస్తుందనే ఆశతో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. అయితే అధికారుల తప్పిదం కారణంగా తమను నా3 జాబితాలోకి నెట్టడం వల్ల ఇల్లు పొందే అవకాశం దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. “మా తప్పు ఏమిటి...? మేము అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేయడమేనా? అధికారుల రికార్డు తప్పిదానికి మా కుటుంబాలు ఎందుకు శిక్ష అనుభవించాలి?” అని వారు ప్రశ్నించారు. నా3 నుంచి తొలగించి.. అర్హత ఉంటే నా1లోకి తీసుకురావాలిఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై తక్షణమే దృష్టి సారించాలని కార్మికులు డిమాండ్ చేశారు.

## నిమ్స్ ఆసుపత్రిలో రాకేష్ మృతదేహాన్ని సందర్శించిన సర్పంచ్ రవి. 5000 ఆర్థిక సాయం అందించిన సర్పంచ్ ఆర్మీ రవి

**పాలేరు ఆర్సీ సెప్టెంబర్ 29 (తరంగాలు).**
ఇటీవల తిరుమలాయపాలెం పోలీస్ పెట్రోలింగ్ వాహనం నడుపుతు లారీ డీకొని కాకరవాయి గ్రామానికి చెందిన కొత్తపల్లి రాకేష్ తీవ్రంగా గాయపడ్డారు. ఈరోజు చికిత్స పొందుతూ నిమ్స్ ఆసుపత్రిలో మరణించారని విషయం తెలిసిన వెంటనే సర్పంచ్ ఆర్మీరవి అక్కడికి వెళ్లి వారి తల్లితండ్రులను ఓధరుస్తు ?5000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.ప్రజల్లో ఎల్లప్పుడూ ఉండి నిరంతరం సేవ చేసే నాయకుడు సమాజానికి అవసరం . ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన అన్నారు...



THARANGALU DAILY NEWS
బుధవారం, 30 సెప్టెంబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన డ్రైవర్ రాకేష్ మృతి



- నిమజ్జన విధుల అనంతరం జరిగిన ప్రమాదం.. నిమ్స్‌లో చికిత్స పొందుతూ కన్నుమూత

**పాలేరు ఆర్సీ సెప్టెంబర్ 29 (తరంగాలు):** వినాయక నిమజ్జన విధులు ముగించుకుని తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పోలీసు వాహన డ్రైవర్ కొత్తపల్లి రాకేష్ (22) మంగళవారం మృతి చెందాడు. ప్రమాదం జరిగిన అనంతరం తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాకేష్ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందినట్లు సమాచారం. గత గురువారం అర్ధరాత్రి పిండిప్రోలు నుంచి తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌కు ఎస్సై కూచిపూడి జగదీష్‌తో కలిసి పోలీసు వాహనంలో తిరిగి వస్తుండగా భవాని హోటల్ సమీపంలో లారీ ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఎస్సై జగదీష్‌తో పాటు వాహన డ్రైవర్ రాకేష్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసు వాహనం సైతం తీవ్రంగా ధ్వంసమైంది. ప్రమాదంలో రాకేష్‌కు తలకు బలమైన గాయాలు కావడంతో తొలుత ఖమ్మంలోని స్తంభాద్రి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రాకేష్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. విధుల్లో భాగంగా నిమజ్జన కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకోవడం, అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి.




# ముమ్మరంగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక





పాలేరు ఆర్సీ, సెప్టెంబర్ 29 (తరంగాలు ) : కూసుమంచి మండల వ్యాప్తంగా ముమ్మరంగా వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహిస్తూ పనులను గుర్తిస్తున్నట్లు ఎంపీడీవో జశ్వంత్ కుమార్, ఏపీవో బాబు తెలిపారు. మంగళవారం వి బి జి రామ్ జి పథకం అమలులో భాగంగా ఈశ్వర్ మాదారం, నేలపట్ల, పెరిక సింగారం, గైగోల్లపల్లి, సంధ్య తండా, నాయకన్ గూడెం, మంగళ్ తండా, మునిగేపల్లి, కోక్య తండా, లోక్య తండా, పంచాయతీలలో గ్రామ సర్పంచుల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాల్లో సామాజిక పటం, సహజ వనరుల పటం ప్రజల భాగస్వామ్యంతో గీయించి పనులను గుర్తించడం జరిగినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న వి బి జి రామ్ జి పథకం ప్రతి గ్రామంలో విజయవంతంగా అమలయ్యే విధంగా కిందిస్థాయి నుంచి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమం అమలులో సర్పంచులు కీలక పాత్ర వహించాలని వారు తెలిపారు. అందరి సహకారంతోనే పథకం విజయవంతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఏపీవో తో పాటు ఇంజనీరింగ్ కన్సల్టెంట్, గ్రామ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ రెడ్ క్రాస్ పాలకమండలి సభ్యుడిగా డాక్టర్.గజవెల్లి రాజ్ కుమార్



- ప్రమాణ స్వీకారం అనంతరం నియామక పత్రం అందుకున్న డాక్టర్ రాజ్ కుమార్

**వర్ధన్నపేట ప్రతినిధి, సెప్టెంబర్ 29, (తరంగాలు):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా పాలక మండలి ఎన్నికలు సోమవారం ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో చైర్మన్‌గా భేతి అశోక్ బాబు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, పాలక మండలి సభ్యుడిగా రెండవ సారి డాక్టర్ గజవెల్లి రాజ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గజవెల్లి రాజ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నియామక పత్రాన్ని అందుకున్నారు. రెడ్ క్రాస్ సొసైటీ వంటి ప్రతిష్టాత్మక మానవతా సేవా సంస్థలో పాలక మండలి సభ్యుడిగా డాక్టర్ గజవెల్లి రాజ్ కుమార్ బాధ్యతలు స్వీకరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ గజవెల్లి రాజ్ కుమార్‌తో పాటు నూతన పాలక మండలి సభ్యులను ఈ సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం, వైద్య సహాయం, అత్యవసర సేవలు, విపత్తుల సమయంలో సహాయక కార్యక్రమాలు, పేదలు మరియు ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే సేవలను మరింత విస్తృతం చేయాలని పలువురు ఆకాంక్షించారు. డాక్టర్ గజవెల్లి రాజ్ కుమార్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రెడ్ క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని పలువురు కోరారు. ఆయన ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యం లభించి, అవసరంలో



## భూక్య రవి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

- మండల పార్టీ అధ్యక్షులు -శాఖమూరి హరిబాబు
- ఆత్మ డివిజన్ చైర్మన్ యడ్ల. బిక్షం రెడ్డి
- మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు



***నర్సంపేట ప్రతినిధి, సెప్టెంబర్:29(తరంగాలు)***
ఖానాపురం మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త భూక్య రవి గత ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, ఆత్మ డివిజన్ చైర్మన్ యడ్ల భిక్షం రెడ్డి ఆధ్వర్యంలో 50 వేల రూపాయలు సేకరించి మృతుడు రవి కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే పరుచూరి రత్నాకర్ రావు, చదలవాడ బసవకుమార్ లు చెరో 50 కేజీల చొప్పున మొత్తం 1 క్వింటా బియ్యం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా పార్టీని వీడలేదని అన్నారు. అతని కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. అలాగే రవి మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే మేం ఉన్నామంటూ తమవంతు సహాయం అందించడానికి ముందుకు వచ్చిన ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు, అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మండవ శివ ప్రసాద్ రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వీరమనేని సాగర్ రావు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.ముస్తఫా, సొసైటీ డైరెక్టర్ లు దేవినేని వేణుగోపాల్ రావు, మద్రి ప్రభాకర్, వార్డు సభ్యులు శాఖమూరి ముఖేష్ చౌదరి, చలిగంటి మల్లిఖార్జున్, సీనియర్ నాయకులు శాఖమూరి కృష్ణారావు, తోటకూరి రాజు యాదవ్, మాజీ వార్డు సభ్యుడు బోడ స్వామి, గుగులోతు కిరణ్, అంగోతు బొంద్యాలు, భూక్య నాగ, రూప్సింగ్, తారాచంద్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు

- నేటి నుంచే ఓటరుగా నమోదు అవ్వండి.
- పట్టభద్రులకు- పాలేరు మాజీ శాసనసభ్యులు
- శ్రీ కందాళ ఉపేందర్ రెడ్డి పిలుపు.



**పాలేరు ఆర్సీ సెప్టెంబర్29 (తరంగాలు).**
ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఓటరు నమోదు ప్రక్రియ నేటి నుంచే ప్రారంభమైంది. డిగ్రీ లేదా ఎన్నికల నిబంధనల ప్రకారం సమానమైన అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలి. నియోజకవర్గ ఓటర్ల జాబితా కోసం తాజా నమోదు ప్రక్రియ చేపడుతున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. సెప్టెంబర్ 28 నుంచి నవంబర్ 6 వరకు అందుబాటులో ఉన్న అధికారిక నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకుని అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ పేరును నమోదు చేసుకోవాలి ఆయన అన్నారు. ఆన్‌లైన్‌లో ఎన్నికల సేవల కోసం "తెలంగాణ సీఈవోఅధికారికవెబ్‌సైట్" )ను, అలాగే ఎన్నికల సంఘం "ఓటరు నమోదు కేవలం హక్కు కాదు.. ప్రజాస్వామ్యంలో మన బాధ్యత కూడా. ఒక్క ఓటు కూడా వృథా కాకుండా ప్రతి పట్టభద్రుడు ఈ ప్రక్రియలో భాగస్వామి కావాలి. మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనపై ప్రజల అభిప్రాయానికి ఈ ఎన్నికలు వేదికగా నిలుస్తాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు ఎదుర్కొన్న పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, యువత తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు..,

## సాయంత్రం సమయంలో తినాల్సిన ఆరోగ్యకరమైన స్నాక్స్ ఇవే ఏమేం లాభాలు కలుగుతాయంటే

। సాయంత్రం 4 లేదా 5 గంటల సమయానికి టీ తాగుతూ ఏదైనా చిరుతిండి తినడం చాలామందికి అలవాటుగా ఉంటుంది. వేడి వేడి పకోడీలు, చాట్, చిప్స్ లేదా భుజియా వంటి పదార్థాలు వెంటనే తినాలనిపిస్తుంది. అప్పుడప్పుడు ఇలాంటి చిరుతిళ్లు తీసుకోవడం పెద్దగా ఆందోళన కలిగించకపోయినా, ప్రతిరోజూ సాయంత్రం ఇదే అలవాటు కొనసాగితే ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం మంచిది. ఈ నేపథ్యంలో పోషక విలువలు, సౌకర్యం, ధర వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రూ. 50లోపే అందుబాటులో ఉండే ఐదు చిరుతిళ్లను పోషకాహార నిపుణులు సూచించారు. వీటిని ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు.

### వేయించిన శనగలు, స్వీట్ కార్న్

వీటిలో మొదటిది వేయించిన శనగలు. తక్కువ ఖర్చుతో లభించే ఈ చిరుతిండిలో ప్రోటీన్, పీచు పదార్థాలు ఉంటాయి. 30 గ్రాముల శనగలలో సుమారు 6 గ్రాముల ప్రోటీన్, 5 గ్రాముల పీచు లభిస్తుందని పేర్కొన్నారు. ఇక స్వీట్ కార్న్ కూడా మంచి ప్రత్యామ్నాయంగా సూచించారు. థియేటర్లలో లభించే కార్న్‌లో ఎక్కువ వెన్న లేదా మసాలా ఉండే అవకాశం ఉన్నందున, దానికి బదులుగా ఇంట్లోనే కార్న్‌ను ఉడికించి ఉల్లిపాయ, టమాటా, నిమ్మరసం వంటి వాటితో చాట్ తరహాలో తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఇలా చేస్తే రుచితో పాటు ఇంట్లో తయారు చేసిన చిరుతిండిని తీసుకునే అవకాశం ఉంటుంది.

# అధికారంలో రైతు-కూలీల భాగస్వామ్యమే మార్పుకుమూలం






**•ఏఐకెయంయస్ జాతీయ మహాసభల్లో సామాజిక శాస్త్రవేత్త ప్రొ.మనోరంజన్ మహంతి**

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 29:** అధికారంలో రైతు-కూలీల భాగస్వామ్యం పొందిన రోజే రైతు-కూలీల విముక్తికి అర్థం ఉంటుందని ,ఆదిశగా ఏఐకెయంయస్ తన వ్యూహాన్ని రూపొందించుకోవాలని డిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్, సామాజిక శాస్త్ర వేత్త ప్రొ.మనోరంజన్ మహంతి ఉద్బోధించారు.మంగళవారం స్థానిక వైరా రోడ్డులోని పియస్ఆర్ పంక్షన్ హాలు(అజ్మీర్ సింగ్ హాలు)లో అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ నాల్గవ జాతీయ మహాసభలలో ప్రారంభిస్తూ ప్రారంభ ఉపన్యాసం చేశారు.దేశంలోఆహారంతోసహా అనేక ఉత్పత్తి ప్రదాతలైన రైతులు,కూలీలు, కార్మికుల అవసరాలు, హక్కుల పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అశ్రద్ధ చూపుతున్నాయని అన్నారు.వారిలో గ్రామీణ ప్రాంతాల్లో నివశిస్తున్న మెజారిటీ ప్రజలైన రైతు కూలీలు మరింత వివక్షత,అణచివేత కు గురి అవుతున్నారు.వారిలోదళితులు, గిరిజనులు,మహిళలు, పిల్లలు మరింత ఆకలి,పేదరికం,పోషకాహారం లోపం, సామాజిక అణచివేత, కనీస సౌకర్యాలు కొరతతో పేదరికం లో జీవిస్తున్నారని అన్నారు.కేవలం రైతు-కూలీల సమస్యలు,హక్కుల కోసమే కాకుండా అధికారాన్ని సాధించడమే అంతిమ పరిష్కారం అవుతుందని సూచించారు.అదికారం సాదించడం అంటే కేవలం నిర్ణయాలు తీసుకునే నిర్మాణాల్లో ప్రాతినిధ్యం మాత్రమేకాదు.ఉత్పాదక ఆస్తులు పొందకలిగి ఉండడం, సామాజిక, ఆర్థిక, రాజకీయ లక్ష్యాలను సాధించడానికి సంఘటిత మయ్యే సామర్థ్యం కలిగి ఉండాలని అన్నారు.ఆదివాసీ ప్రాంతంలో జల్,జంగీల్,జమీన్ హక్కులను కాపాడాలని అంటే గిరిజన ప్రాంతాల్లో కార్పోరేట్ దోపిడీ కి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ప్రస్థుతం కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం భూమి,నదులు,గనులు,అడవులు ఆత్మనిర్భర్ భారత్ పేరుతో కార్పోరేట్ శక్తులకు దారాదత్తం చేస్తుందని దుయ్య బట్టారు.రైతులు ప్రభుత్వాలు భావిస్తున్నట్లు లబ్దిదారులు కాదు హక్కు దారులని అన్నారు.నరేంద్రమోడీ పాసిస్ట్ ప్రభుత్వం మెడలు వంచిన పంజాబ్ రైతు ఉద్యమం,కాక్రోచ్ యువత జంతర్ మంతర్ పోరాటంను ప్రశంసించారు.వికశిత్ భారత్ వ్యతిరేకి భారత దేశం వ్యతిరేకి ఎంత మాత్రం కాదని అన్నారు.పాలకులు చెబుతున్నట్లు 7.8 శాతం పెరుగుదల రేటులో రైతుకూలీల స్థానం ఎక్కడని ప్రశ్నించారు.బిజెపి , ఆర్యస్యస్ వందేళ్ళు గా కల్చరల్ అంటే హిందూ భావజాలం వ్యాప్తి, సాంస్కృతిక మార్పు, సరస్వతి విద్యాలయాలు ద్వారా, ఆర్యస్యస్ శాఖల వ్యాప్తి ద్వారా అధికారం చేపట్టారని, స్థిరీకరణ ప్రయత్నం చేస్తున్నారని,ఆభావజాలాన్ని ఓడించాలంటే వివిధ వర్గాలుగా చీలి ఉన్న శ్రామిక వర్గాలు పునాది నుండి అబివృద్ధి , ఐక్యం కావాలని అన్నారు.ఏఐకెయంయస్ సాంప్రదాయిక సంస్థాగత రూపాలు,పోరాటాలతో పాటు శ్రామిక అధికారం కోసం మూడు కోణాల్లో పోరాడాలని పిలుపు నిచ్చారు.నాణ్యమైన విద్యా, వైద్యం,ఉపాధి, సుస్థిర అభివృద్ధి కోసం దిగువ స్థాయి పంచాయతీ రాజ్ సంస్థలనుండి అంచెలంచెలుగా అధికారం కోసం పోరాడాలని అన్నారు.కార్పోరేట్ సంస్థలు, సామ్రాజ్య వాదం తదితర శ్రేణులను ఎదిరించడానికి ప్రాథమిక స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు కలిసివచ్చే స్వపక్షియ శక్తులతో ఐక్య కార్యాచరణ అవసరం అన్నారు.శ్రామిక ప్రజలు అనైక్యత ను పాలకపక్షం తమ ప్రయోజనాల కు వాడుకుంటుంది.సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ,పరస్పరత,సుస్థిరత,సూత్రాలపై ఆదారపడిన సమాజం నిర్మాణం లక్ష్యంగా ఏఐకేయంయస్ తీర్మాణాలు ఉండాలని ఆశించారు.దేశవ్యాప్తంగా రైతు-కూలీలను ఐక్యపరచి నాయకత్వం వహించే దిశగా ఈ ఏఐకేయంయస్ మహాసభల నిర్ణయాలు ఉండాలని ఆకాంక్షించారు.సభకు ఏఐకెయంయస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య అధ్యక్షత వహించారు.తొలుత ఆహ్వాన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ యంయఫ్ గోపినాథ్,టి.వేణు ప్రతినిధులకు ఆహ్వానం పలుకుతూ ప్రసంగించారు.దేశంలోని నలుమూలల నుంచి హాజరైన రైతుకూలీ సంఘాలు సభలో సంఘిబావ ప్రసంగాలు చేశారు.తమిళనాడుకు చెందిన పీజెంట్ లిబరేషన్ ఫ్రంట్ నేత సెల్వరాజ్ మాట్లాడుతూ మనందరి ఉమ్మడి శతృవు అయిన కార్పోరేట్,సెఫ్రాన్ ఫాసిజం కు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఓరిస్సా గిరిజన రైతు సలహాదారు విజయ్ ఉపాద్యాయ మాట్లాడుతూ కార్పోరేట్ శక్తులు గిరిజన పంచాయతీలకు ఉన్న పీసా చట్టాలను కూడా కాలరాచి దోపిడీ కి పాల్పడుతున్నాయని అన్నారు.ఉత్తరప్రదేశ్ కిసాన్ ఏక్తా రైతు నాయకుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దేశ సంపదను అదానీ,అంబానీ లాంటి కొందరు ఆశ్రిత పెట్టబడీ దారులను వ్యవసాయ రంగం పై దోపిడీ కి ఉసిగొల్పుతుందని అన్నారు.ఏఐకేయుయస్ నాయకుడు కెచ్చెల రంగయ్య, ఏఐకేయంయస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అశీస్ మిట్టల్,ఉపాధ్యక్షులు నిర్భయ సింగ్,జెవి చలపతిరావు, కార్యదర్శి బాలచంద్ర షడంగి, సుశాంత్ ఝ, రవీంద్ర సింగ్ భాటియా, జితేంద్ర సింగ్,టీజర్, జలంధర్ సింగ్,శంభూప్రసాద్ సింగ్, సుధాకర్,వి.కోటేశ్వరరావు,చిట్టిపాటి వెంకటేశ్వర్లు,తేజ్ జీత్ చౌదరి,మామిడాల బిక్షపతి, దుర్గా ప్రసాద్,గాదె దివాకర్,పిఓడబ్ల్యు జాతీయ సమన్వయ కర్త గాదె ఝాన్సీ,ఐయఫ్ టియు జాతీయ కార్యదర్శి టి.శ్రీనివాస్,పిడియస్ యు జాతీయ సమన్వయ కర్త మహేష్ తదితరులు ప్రారంభ సభలో ప్రసంగించారు.ఏఐకెయంయస్ నాల్గవ జాతీయ మహాసభలు ప్రారంభ సూచికగా ఏఐకేయంయస్ జాతీయ పతాకాన్ని తొలుత ఆసంస్థ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య ఆవిష్కరణ చేశారు.మహాసభల ప్రారంభం కు ముందు వివిధ రాష్ట్రాల కళాకారులు తమ పాటలతో అలరించారు.ఓంగోలు అరుణోదయ కళాకారులు ప్రదర్శించిన ఆజాదీ నృత్యం సభికులను ఆకట్టుకుంది.మంగళవారం ఇక్కడ ప్రారంభం అయిన మహాసభల్లో దేశంలోని 16 రాష్ట్రల నుండి 450 మంది ఏఐకేయంయస్ ప్రతినిధులు పాల్గొంటున్నారు.వివిధ రాష్ట్రల రైతుకూలీ ఉద్యమాలు, ఏఐకేయంయస్ భవిష్యత్తు కార్యాచరణ పై ప్రతినిధులు రెండు రోజుల సమావేశాల్లో చర్చిస్తారు.

# నెయ్యి మన శరీరానికి మేలు చేస్తుంది కానీ ఆరోగ్యకరమైన రీతిలో తీసుకోవాలి

భారతీయ వంటకాలలో నెయ్యికి ప్రత్యేక స్థానం ఉంది. పప్పు, అన్నం, చపాతీలతో పాటు పండుగల సమయంలో తయారుచేసే స్వీట్లలోనూ నెయ్యిని విస్తృతంగా ఉపయోగిస్తారు. ఆయుర్వేదంలోనూ నెయ్యికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే నెయ్యి ఆరోగ్యానికి మేలు చేస్తుందనే నమ్మకంతో పరిమితి లేకుండా తీసుకోవడం మాత్రం సమస్యలకు దారితీస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. నెయ్యిలో కొవ్వు, ముఖ్యంగా సంతృప్త కొవ్వు అధికంగా ఉంటుంది. సుమారు 100 గ్రాముల నెయ్యిలో 883 కిలోకేలరీల శక్తి ఉంటుంది. అందువల్ల నెయ్యి నాణ్యతతోపాటు తీసుకునే పరిమాణంపై కూడా శ్రద్ధ పెట్టడం అవసరం.



### కొవ్వు పేరుకుపోయే అవకాశం

రోజువారీ ఆహారంలో నెయ్యి పరిమాణం పెరిగితే శరీరంలో సంతృప్త కొవ్వు అధికమవుతుంది. ఇది రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితం చేస్తుంది. అధిక కొలెస్ట్రాల్ కాలక్రమేణా రక్తనాళాల గోడలపై పేరుకుపోయి వాటిని ఇరుకుగా మార్చే అవకాశం ఉంటుంది. ఫలితంగా గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ముఖ్యంగా భారతీయుల్లో బయటకు సన్నగా కనిపించినప్పటికీ శరీరంలో కొవ్వు నిల్వలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఈ అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఆసియా ప్రజలకు అధిక బరువును అంచనా వేసే బాడీ మాస్ ఇండెక్స్ పరిమితిని 23గా పరిగణిస్తారు.

### ఎంత తీసుకోవచ్చు

ఆరోగ్యకరమైన పెద్దలు రోజుకు ఒకటి నుంచి రెండు టీస్పూన్ల నెయ్యిని మొత్తం వంట కొవ్వుల పరిమితిలో భాగంగా తీసుకోవాలి. నెయ్యి, నూనెలు, వెన్న వంటి అన్ని కొవ్వులు కలిపి రోజుకు సుమారు 20 నుంచి 50 గ్రాముల మధ్య ఉండేలా చూసుకోవాలి. ఇది వ్యక్తి శారీరక చురుకుదనాన్ని బట్టి మారుతుంది. రోజువారీ శక్తి అవసరాల్లో సంతృప్త కొవ్వు వాటా 7 శాతానికి మించకుండా చూసుకోవడం మంచిది. ఇప్పటికే గుండె జబ్బులు, మధుమేహం లేదా అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు నెయ్యి పరిమాణాన్ని మరింత తగ్గించాల్సి ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో రోజుకు ఒక టీస్పూన్ వరకు పరిమితం చేయడం, మిగతా వంటలకు ఆవాలు, వేరుశెనగ, నువ్వుల నూనెలను ఉపయోగించడం సూచించారు.

### పూర్తిగా మానేయాల్సిన పనిలేదు..

అయితే నెయ్యిని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. వంటలో ఎక్కువగా వేయడం కంటే చివర్లో రుచి, సువాసన కోసం కొద్దిగా ఉపయోగించడం మంచిది. ఉదాహరణకు, పప్పు లేదా ఇతర వంటకాలపై కొద్దిగా నెయ్యి వేసుకోవడం ద్వారా రుచిని ఆస్వాదించవచ్చు. ముఖ్యంగా నెయ్యిని అంచనా లేకుండా పోయడం కాకుండా టీస్పూన్‌తో కొలిచి ఉపయోగించడం అలవాటు చేసుకోవాలి. నెయ్యి ఆరోగ్యానికి పూర్తిగా హానికరమైన పదార్థం కాదు. అయితే పరిమితికి మించి తీసుకుంటే సంతృప్త కొవ్వు, అధిక కేలరీల కారణంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. కాబట్టి పరిమిత పరిమాణంలో తీసుకోవడమే ఆరోగ్యకరమైన విధానమని నిపుణులు చెబుతున్నారు.

## జీఎల్‌పీ-1 మందులతో చూపు కోల్పోయామని కంపెనీలపై బాధితుల ఫిర్యాదు ఖండించిన సంస్థలు



మధుమేహం, ఊబకాయం నియంత్రణలో విస్తృతంగా ఉపయోగిస్తున్న జీఎల్‌పీ-1 తరగతి మందులపై అమెరికాలో కొత్త వివాదం మొదలైంది. ఓజెంపిక్, వెగోవీ, జెప్‌బౌండ్ వంటి మందులు వాడిన తర్వాత అకస్మాత్తుగా చూపు కోల్పోయినట్లు పలువురు రోగులు ఆరోపిస్తూ వాటి తయారీ సంస్థలపై కేసులు వేశారు. ఈ కేసుల్లో ప్రధానంగా నాన్‌ఆర్టరిటిక్ యాంటీరియర్ ఇస్కీమిక్ ఆప్టిక్ న్యూరోపతి (ఎన్‌ఏఐఓఎన్) అనే అరుదైన కంటి సమస్యను ప్రస్తావించారు. ఈ పరిస్థితి సాధారణంగా ఒక కంటిలో అకస్మాత్తుగా చూపు తగ్గడానికి కారణమవుతుంది. అయితే కేసులు దాఖలైనంత మాత్రాన మందుల వల్లే ఈ సమస్య ఏర్పడిందని నిర్ధారణ అయినట్లు కాదు. మందుల తయారీ సంస్థలు కూడా ఈ ఆరోపణలను ఖండించాయి.

### అధ్యయనంలో ఏం తేలింది..

జీఎల్‌పీ-1 మందులు, ముఖ్యంగా సెమాగ్లుటైడ్ విషయంలో చూపు కోల్పోయే ప్రమాదంపై ఆందోళనలు కొన్ని పరిశీలనాత్మక అధ్యయనాల తర్వాత మొదలయ్యాయి. 2024లో దాదాపు 2.97 లక్షల మందిపై నిర్వహించిన అంతర్జాతీయ అధ్యయనంలో సెమాగ్లుటైడ్ వాడకానికి, ఎన్‌ఏఐఓఎన్‌కు మధ్య గణాంకపరంగా గణనీయమైన సంబంధం కనిపించలేదు. అయితే ఇతర పరిశోధనల్లో మాత్రం ఈ రెండింటి మధ్య సాధ్యమైన సంబంధం ఉన్నట్లు సూచనలు రావడంతో మరింత పరిశీలన కొనసాగుతోంది. 2025లో ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఈ అంశంపై వైద్య ఉత్పత్తి హెచ్చరికను జారీ చేసింది. యూరప్, బ్రిటన్ నియంత్రణ సంస్థలు సెమాగ్లుటైడ్ మందులతో ఎన్‌ఏఐఓఎన్ చాలా అరుదుగా సంభవించే దుష్ప్రభావంగా పేర్కొన్నాయి.

### మందులే కారణమా..

ఇటీవలి పరిశోధనలు కూడా ఈ విషయంపై స్పష్టమైన తుది నిర్ణయానికి రాలేదు. 2026లో ప్రచురితమైన ఒక సమీక్ష, మెటా-విశ్లేషణలో 48 లక్షలకు పైగా మందిని పరిశీలించిన ఆరు అధ్యయనాలను విశ్లేషించగా, సెమాగ్లుటైడ్ వాడేవారిలో ఎన్‌ఏఐఓఎన్ ప్రమాదం గణాంకపరంగా గణనీయంగా పెరిగినట్లు నిర్ధారణ కాలేదు. అయితే అధ్యయనాల మధ్య ఉన్న తేడాలు, ఇతర పరిమితుల కారణంగా ఆధారాలపై నమ్మక స్థాయి తక్కువగా ఉన్నట్లు పరిశోధకులు పేర్కొన్నారు. మరో సమీక్షలోనూ జీఎల్‌పీ-1 మందులు, ఎన్‌ఏఐఓఎన్ మధ్య సంబంధంపై పరిశోధనల్లో భిన్నమైన ఫలితాలు వచ్చినట్లు వెల్లడైంది. అంటే ప్రమాదానికి సంబంధించిన సంకేతాలు ఉన్నప్పటికీ, మందులే నేరుగా ఈ సమస్యకు కారణమని ఇప్పటివరకు నిర్ధారణ కాలేదు.

### మందులను ఆపాలా..

ప్రస్తుతం జీఎల్‌పీ-1 మందులు వాడుతున్నవారు కేవలం ఈ కేసుల కారణంగా స్వయంగా మందులు ఆపకూడదని సూచిస్తున్నారు. మధుమేహం, ఊబకాయం వంటి ఆరోగ్య సమస్యల చికిత్సలో ఈ మందులకు ఉపయోగాలు ఉన్నందున, వాటి ప్రయోజనాలు, సాధ్యమైన ప్రమాదాలను పరిగణనలోకి తీసుకుని చికిత్సపై నిర్ణయం తీసుకోవాలి. అయితే చూపులో అకస్మాత్తుగా తగ్గుదల లేదా వేగంగా మార్పు కనిపిస్తే మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. అలాంటి సందర్భంలో వెంటనే కంటి వైద్య నిపుణుడిని సంప్రదించాలి. ప్రస్తుతం ఈ కేసులు ఆరోపణల దశలోనే ఉండగా, జీఎల్‌పీ-1 మందులు, అరుదైన అకస్మాత్తు చూపు కోల్పోవడం మధ్య సంబంధంపై శాస్త్రీయ పరిశీలన కొనసాగుతోంది.

## సాధారణ దగ్గు, జలుబు, కోవిడ్‌ల మధ్య లక్షణాలు ఎలా ఉంటాయి ఎలా గుర్తించాలి

చలికాలం ప్రారంభమయ్యే సమయంలో కోవిడ్-19, ఆర్ఎస్‌వీ, ఫ్లూ, సాధారణ జలుబు వంటి శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా కనిపిస్తాయి. వీటిలో చాలా వ్యాధుల లక్షణాలు ఒకేలా ఉండడంతో పిల్లలకు వచ్చిన ఇన్‌ఫెక్షన్ ఏదో గుర్తించడం కొన్నిసార్లు కష్టంగా ఉంటుంది. దగ్గు, ముక్కు కారడం, గొంతు నొప్పి వంటి లక్షణాలు కనిపించినప్పుడు పిల్లలను స్కూల్‌కు పంపించాలా, ఇంట్లోనే ఉంచాలా అనే సందేహం తల్లిదండ్రులకు వస్తుంది. అనారోగ్యంగా ఉన్న పిల్లలను స్కూల్‌కు పంపించడం వల్ల వారు కోలుకోవడానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉండడంతో పాటు, తోటి విద్యార్థులకు, సిబ్బందికి కూడా ఇన్‌ఫెక్షన్ వ్యాపించే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా ఇప్పటికే ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఈ ఇన్‌ఫెక్షన్లు తీవ్రమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుంది.

### వైరస్‌ల వచ్చే దగ్గు, జలుబు..

సాధారణ జలుబు వివిధ రకాల వైరస్‌ల వల్ల వస్తుంది. దగ్గు, తుమ్ములు, గొంతు నొప్పి, ముక్కు కారడం వంటి లక్షణాలు సాధారణంగా కనిపిస్తాయి. ఇవి ఎక్కువగా స్వల్పంగా ఉండి, దాదాపు 7 నుంచి 10 రోజుల్లో తగ్గిపోతాయి. కోవిడ్-19 మాత్రం సార్స్-కోవ్-2 అనే వైరస్ వల్ల వస్తుంది. దీని లక్షణాలు సాధారణంగా 7 నుంచి 14 రోజుల వరకు ఉంటాయి. కొందరిలో మూడు నుంచి నాలుగు వారాల వరకు కొనసాగుతాయి. దగ్గు, గొంతు నొప్పి, ముక్కు కారడంతోపాటు శరీర నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తలనొప్పి, అలసట, జ్వరం, రుచి లేదా వాసన కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు వంటి జీర్ణవ్యవస్థకు సంబంధించిన లక్షణాలు కూడా కొందరిలో కనిపించే అవకాశం ఉంది.

### ఫ్లూ లక్షణాలు అయితే..

ఫ్లూ లక్షణాలు సాధారణ జలుబు లేదా కోవిడ్‌తో పోలిస్తే అకస్మాత్తుగా మొదలయ్యే అవకాశం ఉంది. ఇవి సాధారణంగా 3 నుంచి 7 రోజుల పాటు కొనసాగుతాయి. కోవిడ్‌లో కనిపించే కొన్ని లక్షణాలు ఫ్లూలోనూ ఉంటాయి. అయితే రుచి లేదా వాసన కోల్పోవడం సాధారణంగా ఫ్లూ లక్షణంగా కనిపించదు. ఆర్ఎస్‌వీ లక్షణాలు జలుబును పోలి ఉన్నప్పటికీ, ఆకలి తగ్గడం కూడా కనిపిస్తుంది. ఇది ఊపిరితిత్తులను ప్రభావితం చేసి ముఖ్యంగా చిన్నారులు, శిశువుల్లో తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్, ఆసుపత్రిలో చేరే పరిస్థితికి దారితీస్తుంది. దీని లక్షణాలు మూడు నుంచి నాలుగు వారాల వరకు కొనసాగుతాయి. అందువల్ల వైరస్ ఏదో కచ్చితంగా తెలియకపోయినా, అనారోగ్యంగా ఉన్న పిల్లలను ఇంట్లో ఉంచడం ద్వారా ఇతరులకు వ్యాధి వ్యాప్తిని తగ్గించవచ్చు.

# రోడ్డు మార్జిన్లు ఖాళీ చేయాల్సిందే..

- వాహన రాకపోకలకు అడ్డుగా ఉన్న నిర్మాణాలపై అధికారుల దృష్టి
- వర్ధన్నపేటలో రోడ్డు భద్రతపై వరంగల్ సీపీ ఎన్. శ్వేత, క్షేత్రస్థాయి పరిశీలన
- రోడ్డు మార్జిన్ ఆక్రమణల తొలగింపునకు చర్యలు..



**వర్ధన్నపేట ప్రతినిధి, సెప్టెంబర్ 30 (తరంగాలు):** వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్--ఖమ్మం జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణితో కలిసి వర్ధన్నపేట పట్టణంలోని జాతీయ రహదారి పరిధిలోని వివిధ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్డు మార్జిన్‌లను ఆక్రమించి నిర్మించిన గృహాలు, దుకాణాలు, షెడ్లు తదితర నిర్మాణాల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా మలుపులు, కూడళ్లు, అధిక రద్దీ ప్రాంతాల్లో రహదారి భద్రతకు ఆటంకాలు ఏర్పడి ప్రమాదాల ముప్పు పెరుగుతున్నట్లు పేర్కొన్నారు.ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆక్రమణలు, నిర్మాణాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, వేగ నియంత్రణ చర్యలు చేపట్టడం, ట్రాఫిక్ నిర్వహణను మరింత పటిష్టం చేయడంపై దృష్టి సారించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా సీపీ ఎన్. శ్వేత మాట్లాడుతూ రోడ్డు భద్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించి వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి మాట్లాడుతూ వర్ధన్నపేట పట్టణ ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలను తగ్గించేందుకు మున్సిపాలిటీ, పోలీస్, రెవెన్యూ, నేషనల్ హైవే తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ సౌకర్యాల మెరుగుదల, ఆక్రమణల తొలగింపు వంటి అంశాల్లో ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి, భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వేస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్, ఏసీబీ అంబటి నరసయ్య, సీఐ సంజీవరావు, ఎస్సైలు సాయి బాబు, ముత్యం రాజేందర్, రాజు, రామారావు,నేషనల్ హైవే, పోలీస్, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# కస్తూర్బా వృద్ధాశ్రమంలో సేవా సందడి





- వృద్ధులకు భోజనం,పండ్లు పంపిణీ చేసిన బీజేపీ నేతలు

**ములుగు ప్రతినిధి , సెప్టెంబర్ 29 (తరంగాలు):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ములుగులోని కస్తూర్బా అనాథ వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఓబీసీ ములుగు జిల్లా అధ్యక్షుడు దండిగా వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనాథలు, వృద్ధులకు బీజేపీ నాయకులు స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం పండ్లు పంపిణీ చేసి, వృద్ధులతో కొంతసేపు గడిపి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ పార్లమెంటరీ సభ్యులు డా. సీతారాం నాయక్, ఓబీసీ ములుగు ఇన్‌చార్జి మహేందర్ యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జవహర్ నాయక్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా బుచ్చయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సేవా కార్యక్రమాల ద్వారా అనాథలు, వృద్ధులకు అండగా నిలవడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. వృద్ధుల ఆశీర్వాదాలు పొందడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు బీజేపీ నాయకులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో మంగపేట మండల బీజేపీ అధ్యక్షుడు జానకి రామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రావు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాషా, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎరంగారి విరాన్ కుమార్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడిచేర్ల రాజశేఖర్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీధర్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కొర్ర సుమలత, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రల్ల ఎల్లయ్య, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పాలక గంగా,ఏటూరునాగారం ఓబీసీ మండల అధ్యక్షుడు అటికే నాగేశ్వరావు, మండల వైస్ ప్రెసిడెంట్ దుర్గారావు, కన్నాయిగూడెం మండల వైస్ ప్రెసిడెంట్ బొగ్గుల భాస్కర్, బూత్ కమిటీ కన్వీనర్లు, మండల బీజేపీ నాయకులు, యువ మోర్చా అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# హిందూ భావోద్వేగాలతో ఆటలా..





- సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బీజేపీ నేతలు..
- హనుమకొండ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మ దగ్ధం
- సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలని రావు పద్మారెడ్డి, పగడాల కాళీప్రసాద్ డిమాండ్

**హనుమకొండ ప్రతినిధి , సెప్టెంబర్ 29 (తరంగాలు):** సీఎం రేవంత్ రెడ్డి రాముడు, శివుడిపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ హనుమకొండలో బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. సీఎం వ్యాఖ్యలు హిందూ సమాజ భావోద్వేగాలను దెబ్బతీసేలా ఉన్నాయని బీజేపీ నేతలు ఆరోపించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి రావు పద్మారెడ్డి, పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పగడాల కాళీప్రసాద్ రావు మాట్లాడుతూ.. రాముడు, శివుడిని వేర్వేరు ప్రాంతాలు, వర్గాలకు ప్రతీకలుగా చూడటం సనాతన ధర్మ భావనలకు విరుద్ధమని విమర్శించారు. అలాగే శ్రీరాముడు ధనికులకు, శివుడు పేదలకు దేవుడంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా వివాదానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. “దేవుళ్లను, కులాలను, ప్రాంతాలను విడదీసే రాజకీయాలు చేయడం సరికాదు” అని వారు విమర్శించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం, భద్రాచలం శ్రీరామాలయం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఉన్న తెలంగాణలో దేవుళ్ల మధ్య ప్రాంతీయ విభజన తీసుకురావడం తగదన్నారు.మన్యంకొండ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం హరిహర క్షేత్ర సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్న వారు.. హిందూ ఆధ్యాత్మిక సంప్రదాయాలను రాజకీయ వ్యాఖ్యలకు దూరంగా ఉంచాలని కోరారు.“ఎన్నికల సమయంలో దేవుళ్ల పేరుతో ప్రమాణాలు చేసి ఓట్లు అడిగిన నాయకులు.. ఇప్పుడు అదే దేవుళ్లను ప్రాంతాలు, వర్గాల పేరుతో విడదీయడం ఏమిటి?” అని బీజేపీ నేతలు ప్రశ్నించారు.సీఎం వ్యాఖ్యలతో హిందూ సమాజ భావోద్వేగాలు దెబ్బతిన్నాయని ఆరోపిస్తూ రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. స్పందన లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పి. జయంత్ లాల్, ఆకుల శ్రీకాంత్ పటేల్, బైరి శ్రావణ్, బొమ్మసాని అనిల్, జరీనా, ధనలక్ష్మి, కొండెం రవీంద్రరెడ్డి, భారత్ గౌడ్, శ్రీరాంరెడ్డి, పున్నం వేణు, మాజీ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి తదితరులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సాయంత్రం సమయంలో తినాల్సిన ఆరోగ్యకరమైన స్నాక్స్ ఇవే ఏమేం లాభాలు కలుగుతాయంటే

సాయంత్రం 4 లేదా 5 గంటల సమయానికి టీ తాగుతూ ఏదైనా చిరుతిండి తినడం చాలామందికి అలవాటుగా ఉంటుంది. వేడి వేడి పకోడీలు, చాట్, చిప్స్ లేదా భుజియా వంటి పదార్థాలు వెంటనే తినాలనిపిస్తుంది. అప్పుడప్పుడు ఇలాంటి చిరుతిళ్లు తీసుకోవడం పెద్దగా ఆందోళన కలిగించకపోయినా, ప్రతిరోజూ సాయంత్రం ఇదే అలవాటు కొనసాగితే ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం మంచిది. ఈ నేపథ్యంలో పోషక విలువలు, సౌకర్యం, ధర వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రూ.50లోపే అందుబాటులో ఉండే ఐదు చిరుతిళ్లను పోషకాహార నిపుణులు సూచించారు. వీటిని ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు.

### వేయించిన శనగలు, స్వీట్ కార్న్..

వీటిలో మొదటిది వేయించిన శనగలు. తక్కువ ఖర్చుతో లభించే ఈ చిరుతిండిలో ప్రొటీన్, పీచు పదార్థాలు ఉంటాయి. 30 గ్రాముల శనగలలో సుమారు 6 గ్రాముల ప్రొటీన్, 5 గ్రాముల పీచు లభిస్తుందని పేర్కొన్నారు. ఇక స్వీట్ కార్న్ కూడా మంచి ప్రత్యామ్నాయంగా సూచించారు. థియేటర్లలో లభించే కార్న్‌లో ఎక్కువ వెన్న లేదా మసాలా ఉండే అవకాశం ఉన్నందున, దానికి బదులుగా ఇంట్లోనే కార్న్‌ను ఉడికించి ఉల్లిపాయ, టమాటా, నిమ్మరసం వంటి వాటితో చాట్ తరహాలో తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఇలా చేస్తే రుచితో పాటు ఇంట్లో తయారు చేసిన చిరుతిండిని తీసుకునే అవకాశం ఉంటుంది.

### మొలకల చాట్..

మరింత కడుపు నిండిన భావన కలిగించే చిరుతిండి కావాలంటే మొలకల చాట్‌ను ఎంచుకోవచ్చని సూచించారు. పప్పుధాన్యాల నుంచి తయారయ్యే మొలకలకు టమాటా, ఉల్లిపాయ, నిమ్మరసం, కొత్తిమీర కలిపి చాట్‌గా తయారు చేసుకోవచ్చు. ఇక మఖానాను కూడా చిరుతిండిగా తీసుకోవచ్చు. అయితే మార్కెట్లో లభించే రుచికరమైన మఖానా ఉత్పత్తుల్లో కొన్నింటిలో నూనె అధికంగా ఉండే అవకాశం ఉందని సూచించారు. అందువల్ల సాధారణ మఖానాను కొనుగోలు చేసి, ఇంట్లోనే కొద్దిగా నూనె లేదా నెయ్యితో వేయించుకోవడం మంచిది.

### చోలే చాట్..

చివరిగా చోలే చాట్‌ను కూడా ఆరోగ్యకరమైన, తక్కువ ఖర్చుతో తయారు చేసుకోగల చిరుతిండిగా సూచించారు. శనగల్లో మొక్కల ఆధారిత ప్రొటీన్, పీచు పదార్థాలు ఉంటాయి. 100 గ్రాముల చోలే చాట్‌లో సుమారు 8 గ్రాముల ప్రొటీన్, 7 గ్రాముల పీచు ఉంటాయి.

## ఆధునిక సాంకేతికత వైద్యులను భర్తీ చేస్తుందా నిపుణులు ఏం చెబుతున్నారు

వైద్య రంగం కేవలం వ్యాధులను గుర్తించడం, చికిత్స అందించడానికే పరిమితం కాకుండా వేగంగా మారుతోంది. ఆసుపత్రుల్లో అపాయింట్‌మెంట్ బుకింగ్ నుంచి వైద్య రికార్డులను పొందడం, పరీక్షలు చేయించుకోవడం, చికిత్స తీసుకోవడం, డిశ్చార్జ్ తర్వాత వైద్యులతో సంప్రదింపులు కొనసాగించడం వరకు ప్రతి దశలో సాంకేతికత వినియోగం పెరుగుతోంది. ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో పాటు వైద్య సమాచారాన్ని సులభంగా పొందే అవకాశం రావడంతో రోగుల అంచనాలు కూడా మారుతున్నాయి. చికిత్సకు సంబంధించిన స్పష్టమైన సమాచారం, ఖర్చుల్లో పారదర్శకత, ఆసుపత్రిలో సులభమైన అనుభవాన్ని వారు కోరుకుంటున్నారు. ఈ మార్పులకు అనుగుణంగా ఆసుపత్రుల్లో డిజిటల్ సేవలు, అనుసంధానమైన వ్యవస్థలు, అధునాతన వైద్య సాంకేతికతలు అందుబాటులోకి వస్తున్నాయి.

### వైద్యులను భర్తీ చేస్తుందా..

ఇకపై డిజిటల్ వైద్య సేవల వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది. ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డుల ద్వారా రోగి ఆరోగ్యానికి సంబంధించిన ముఖ్యమైన వివరాలను వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో చికిత్సలోని వివిధ దశల్లో ఒకే సమాచారాన్ని పదేపదే సేకరించాల్సిన అవసరం తగ్గుతుంది. ఆసుపత్రి నమోదు, వైద్యుల సంప్రదింపులు, పరీక్షలు, చికిత్స, డిశ్చార్జ్ వంటి ప్రక్రియలను అనుసంధానించే వ్యవస్థలు కూడా పెరుగుతున్నాయి. అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవడం, పరీక్షల నివేదికలను పొందడం వంటి సేవలను రోగులు డిజిటల్‌గా ఉపయోగించుకునే అవకాశం పెరుగుతోంది. అయితే సాంకేతికత వైద్యులను భర్తీ చేయదని, వైద్యుల నిర్ణయ సామర్థ్యం, మానవీయత, రోగులతో సమర్థవంతమైన సంభాషణకు ఎప్పటికీ ప్రాధాన్యం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

### నూతన సాంకేతికతలు కీలకం..

వ్యాధుల నిర్ధారణలోనూ కొత్త సాంకేతికతలు కీలకంగా మారుతున్నాయి. అధిక స్పష్టత కలిగిన ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌లు, పీఈటీ–సీటీ, త్రీడీ ఇమేజింగ్, ఆధునిక ప్రయోగశాల, అణు స్థాయి పరీక్షలు రోగి ఆరోగ్య పరిస్థితిపై మరింత వివరమైన సమాచారాన్ని అందిస్తాయి. దీంతో వ్యాధిని మరింత కచ్చితంగా అంచనా వేసి, రోగి అవసరాలకు అనుగుణంగా చికిత్సను రూపొందించే అవకాశం ఉంటుంది. మరోవైపు రోబోటిక్ సహాయంతో చేసే శస్త్రచికిత్సలు, తక్కువ కోతలతో నిర్వహించే చికిత్సలు కూడా ఎంపిక చేసిన రోగులకు అందుబాటులోకి వస్తున్నాయి. కొన్ని శస్త్రచికిత్సల్లో చిన్న కోతల కారణంగా శరీరంపై గాయం తక్కువగా ఉండడం, ఆసుపత్రిలో ఉండే సమయం తగ్గడం,